ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY





శనివారం 13 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 73 | Saturday 13 June 2026 | Vol.No 28 Issue No .73 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

- నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
- ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన



న్యూఢిల్లీ,జూన్12 : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని మిగతా 2లో..

## శాంతిభద్రతల కారణంగానే

# పవన్ సభకు నిరాకరణ

- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా
- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ
- తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు





న్యూఢిల్లీ,జూన్12 :తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చున్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ మిగతా 2లో..

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

- పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి



హైదరాబాద్,జూన్12 : సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా మిగతా 2లో..

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూన్12 : తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' మిగతా 2లో..

## సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది


- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం,జూన్12 : ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా 2లో..

## ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



న్యూఢిల్లీ,జూన్12 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మిగతా 2లో..

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

- క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం



న్యూఢిల్లీ,జూన్12 : దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం మిగతా 2లో..

## భారత నావికుల మృతిపై స్పందించని ప్రధాని

- అమెరికాకు లొంగిపోయాడంటూ రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,జూన్12 : గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టైబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన మిగతా 2లో..

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

- ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
- రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్,జూన్12 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. మిగతా 2లో..

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కోనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



న్యూఢిల్లీ,జూన్12 : పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ మిగతా 2లో..

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం



న్యూఢిల్లీ,జూన్12 : పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు మిగతా 2లో..

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



తిరుపతి,జూన్12 : కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి మిగతా 2లో..

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు





తిరుపతి,జూన్12 : స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్య మంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు మిగతా 2లో..

## ప్రజలు అధికారంతో పాటు.. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



తిరుపతి,జూన్12 : ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ మిగతా 2లో..

## సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్‌ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్‌ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

## భారత నావికుల మృతిపై స్పందించని ప్రధాని

దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జీ7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది.పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర

సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో

సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# ప్రజలు అధికారంతో పాటు.. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం

చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు.

గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది

ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి

దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు. అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని

వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు.ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ

ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ

తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు

వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

## స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం

తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు

బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు.

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు

ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది

ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# సంపాదకీయం

## బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్షించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిదదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బదులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి.

# మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం

### –జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 11 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల అమలుపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి సరఫరా తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల శుభ్రత, నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షా కాలం వస్తున్నందున శానిటేషన్ పై దృష్టి పెట్టాలని,ఫాగింగ్ మిషన్లు, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, మున్సిపల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్ పి సి ఇ ఓ సుధీర్, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, విక్రమ్ సింహా రెడ్డి, బలరాం నాయక్, మల్లేష్, రాకేష్ రెడ్డి,ఇంజినీరింగ్ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచబాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

### –సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి




సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 12 సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెట్విన్ కార్యాలయంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ మరియు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ రూపొందించిన నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేకదినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ గారు చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగిందిఈ సందర్భంగా సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దామని ఆమె అన్నారు బాలల హక్కులు పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు బాలల చే ఎవరైనా పని చేసినట్లయితే టోలి ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని వారు తెలిపారు లేబర్ కార్డు యొక్క ప్రాముఖ్యతను వారు వివరించారు గజ్వేల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండి వికార్ వారు మాట్లాడుతూ లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు వివరించారు ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ శిక్షణ పొందుతున్నవిద్యార్థులనుఉద్దేశించిమాట్లాడుతూ బాల్యం చాలా గొప్పదని విద్యార్థులను బడిలో చేర్పించాలని విద్య ద్వారానే సమాజ అభివృద్ధికిదోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అందరం కృషి చేద్దామని ఆయన పేర్కొన్నారు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ గారు మాట్లాడుతూ బడి వీడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులు కోరారు గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల కోసం ఎంతగానురాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారురాష్ట్రవ్యాప్తంగా మా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం ప్రజలను చైతన్యం చేసేందుకు అన్నిజిల్లాకేంద్రాల్లోకా ర్యక్రమాలునిర్వహి స్తున్నట్లుఆయనతెలిపారు ఈపోస్టర్ఆవిష్కరణకార్యక్రమంలో సెట్విన్ ఇన్చార్జ్ శ్రీనివాస్ జిల్లా యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు అధికం రాజ గౌడ్ రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిడిశెట్టి రాజు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బైరి చంద్రశేఖర్ సెట్విన్ సిబ్బంది తరుణం కుమార్ సెట్విన్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సిద్దిపేట జిల్లా బాలల హక్కుల ప్రజా వేదిక సంకల్ప సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12 విజన్ ఆంధ్రకోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కె హరిత గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించేందుకు రూ. 50 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు.తెలంగాణలోని 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 53 వేల మంది సిబ్బంది, కార్మికులు గ్రామాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ కోసం కీలక సేవలు అందిస్తున్నప్పటికీ, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వంటి సంక్షేమ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, 4 నెలల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని, 2వ పీఆర్సీలో గుర్తించాలని, జీఓ నెం. 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, కార్మికులందరికీ రూ. 10 లక్షల బీమా, ప్రమాద మరణాలకు రూ. 20 లక్షల నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మరియు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాడి మోరేశ్వర్ పెరక శ్రీకాంత్ జిల్లా కోశాధికారి గుండం శంకర్ జిల్లా ఉపాధ్యక్షులు మోర్లే నగేశ్ జిల్లా సహాయ కార్యదర్శి పుష్పలత దుర్గా రమేష్ జిల్లా కమిటీ సభ్యులు భాగ్య రాజమ్మ లక్ష్మీ నగేష్ భార్గవ్ వసంత్ అజిత్ ఖాన్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పంపిణీ చేసిన ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 12జూన్ సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలఅక్బర్ పేట-భూం పల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ లో దుబ్బాక నియోజకవర్గంలోనీ మండలాల సంబంధించి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/శాదిముబారక్ చెక్కుల పంపిణీ చేసిన రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి...దుబ్బాక నియోజకవర్గం సంబంధించి దుబ్బాక, మీరుదొడ్డి, రాయపోల్, తోగుట, దౌల్తబాద్, అక్బర్ పేట భూశీ పల్లి మండలాలకు 594 లబ్ధిదారులకు 5కోట్ల 94 లక్షల 68వేల 904 రూపాయల కళ్యాణ లక్ష్మీ శాదిముబారక్ చెక్కుల పంపిణీ చేయడం జరుగుతుందికార్యక్రమంలో దుబ్బాక ఏం ఎల్ ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, గ్రంధాలయ చైర్మన్ చంద్రం, మున్సిపల్ చైర్మన్ శ్రీ రామ్ సంగీత రవీందర్, ఆర్డీఓ సదానందం, ఆయా మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి మాట్లాడుతూమా ప్రభుత్వం తెలిపిన 6 గ్యారెంటీ లను అమలుకు చేస్తుందని తెలిపారు. పెదవానికో ఇల్లు ఉండాలని ఆనాడు ఇందిరా గాంధీ చేపట్టిన గొప్ప కార్యక్రమం. సొంతింటికలనెరవేర్చడానికి జిల్లాలో దాదాపు 10వేల ఇండ్లు మంజూరు చెయ్యగా, 80 శాతం గ్రౌండింగ్ అయ్యాయని, 5వేలు ఇండ్లు స్లాప్ లు పడ్డాయని నిర్మాణం వేగంగా కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఈ సంవత్సరం కూడా ఇండ్లు శాంక్షన్ చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలిపారు.ఇల్లు కట్టకున్నాక ఇంటి సభ్యుల సౌలభ్యం కోసం కరెంట్ కసం 200 యూనిట్లు గల లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఇప్పటివరకు 158 కోట్ల రూపాయలు డిస్కౌంట్ విద్యుత్ శాఖకు ప్రభుత్వం కట్టడంజరిగింది.మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కోసంజిల్లాలోప్రయాణించిన మహిళలకు గాను 300 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 45వేల పైగా మంజూరుతో పాటు కుటుంబ సభ్యుల చేరికలు సైతం చేశామని, అలాగే ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏ పథకం రావాలన్న ప్రతిదీ రేషన్ కార్డుతోనే ముడిపడూందని పెద్ద ఎత్తున రేషన్ కార్డులు అందజేశామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద 10లక్షల భీమా కల్పించడం జరిగింది.కొత్త పింఛన్లు కోసం ఈ బడ్జెట్ లో కేటాయించడం జరిగిక్దని వాటిని కూడా తొందరలో ప్రజలకు అందిస్తామని తెలిపారు.స్కూల్ పిల్లలకు కొత్తగా బ్రేక్ ఫాస్టుథకం అమలుకు శ్రీకారం చుట్టమని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించడంజరుగుతుంది.ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్న కూడా అన్ని కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.ఈ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లు విద్యార్థులకు మంచి నైపుణ్యాలు తో ఉపాధి అందించడం జరుగుతుంది.రాష్ట్రం లో 56 కొత్త అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 4వేల కోట్ల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను సౌకర్యాలు మెరుగుపరుస్తూ ఒక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అందించి, రాష్ట్రంలోనే కాకుండా బయటి దేశాలకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కోసం మీ యొక్క స్కిల్, భాష ప్రతిదీ నేర్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ సీజన్ లో వచ్చే దానికంటే 30 శాతం వరి ధాన్యం అధికంగా పండడం మూలంగా కొనుగోలు జాప్యం జరిగిందని ఎవ్వరు కూడా అధైర్య పడవద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యూరియా, డిఏపి కొరత లేదని అధునాతన యాప్ ద్వారా కొనుగోలు సులభంగా చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోడానికి సిద్ధంగా ఉందని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక ఏంఎల్ఏ మాట్లాడుతూదేశంలోనే గొప్ప కార్యక్రమం కళ్యాణలక్ష్మీశాదిముబారక్ చెక్కుల పంపిణీ దీనివల్ల లక్షలాది మందికి లబ్ది పొందుతున్నారు.ఈ నియోజకవర్గం పూర్తి వ్యవసాయ ఆధాత కుటుంబాలు, దుబ్బాక నియోజకవర్గం లో ఎక్కువ మొత్తంలో వడ్లు పండాయనీ తెలిపారు.మల్లన్న సాగర్ లో మెయిన్ కెనాల్ పూర్తి, సబ్ కెనాల్ సంబంధించి భూ సేకరణకు సంబంధించిన బకాయిలను విడుదల చెయ్యాలని, దుబ్బాక నియోజకవర్గం లో గో–డౌన్ నిర్మించుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ 27 ఎకరాలు కేటాయించామని వెంటనే శాంక్షన్ చేసి పనులు ప్రారంభించాలని మంత్రి నీ విజ్ఞప్తి చేశారు.

# టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

### ఎస్ ఐ ఆర్ శిక్షణ తరగతుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12విజన్ ఆంధ్ర కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ స్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆసిఫాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనం,బీఆర్ స్ పార్టీ సభ్యత్వ నమోదు,ఎస్ ఐ ఆర్ శిక్షణ తరగతుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్. మంచిర్యాల మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ పాల్గొని నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా నారదాసు లక్ష్మణ్ మాట్లాడుతూజిల్లా లోని ప్రతి ఒక్కరు డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు జరుగుతుంది, డిజిటల్ లో నమోదు చేయడంతో అభ్యర్థి యొక్క పూర్తి వివరాలు తెలుసుకోవడానికి సులువుగా ఉంటుంది,దీనికోసం ఒక యాప్ ను ఏర్పాటు చేయడం జరిగింది దీని వలన జిల్లా , నియోజకవర్గ,మండల,గ్రామ స్థాయిలో ఉంటాయి,అందులో బ్లడ్ వివరాలు,పూర్తి చిరునామా కూడా ఉంటుంది,గతంలో సభ్యత్వం లో పుస్తకాల విధానం ఉండేది,అందులో సభ్యత్వం తప్పుడు నమోదు అయ్యేది,ఇంటింటికి వెళ్లి అభ్యర్థి ఉద్యమ కారులు,పార్టీ కార్యకర్తలు , పార్టీ అభిమానుల ఇంటికి వెళ్లి సభ్యత్వం నమోదు చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.బీఆర్ స్ పార్టీ కి ప్రజా ప్రతినిదులకు సంబంధించిన కుటుంబ సభ్యుల సభ్యత్వ నమోదు చేయాలని అన్నారు.పథకాల లబ్ధిదారులు,యువకులు,మహిళలు అందరితో సభ్యత్వం నమోదు చేయించాలి, ప్రభుత్వ ఇచ్చిన విస్మరించిన హామీల పై ఎండగడుతూ ప్రజలకు వివరించాలి,నిజమైన ఓట్లర్లు,చనిపోయిన వారు,గ్రామం నుండి వేరే గ్రామానికి వెళ్లిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించి గ్రామాల్లో,మున్సిపాలిటీ లో నిజమైన ఓటర్ల జాబితా ఉంటుందని అవగాహ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు,బీఆర్ స్ పార్టీ సిద్ధాంతాలు తెలిసిన వారిని మాత్రమే సభ్యత్వం నమోదు చేయాలని అన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలలో వ్యతిరేకత మొదలైంది,పూర్తి స్థాయిలో సైన్యం చేసుకొని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగాలని అన్నారు,ఈ కార్యమానికి తరలివచ్చిన బీఆర్ స్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు,ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మర్సుకోల సరస్వతి, మండల అధ్యక్షుడు జాబరీ రవీందర్, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ ,వైస్ చైర్మన్ హైమద్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు,రెబ్బెన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకరమ్మ, కార్యకర్తలు, బూత్ లెవెల్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలుఅభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా (జూన్ 12) సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అభినందించారు.తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుష్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు,బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ. 15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ. 30వేలు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్,సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో సీపీఎం..60 రోజుల పాటు చలివేంద్రం నిర్వాహణ

### చలివేంద్రానికి సహకరించిన వారికి ధన్యవాదములు

దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పట్టణంలో సీపీఎం పార్టీ దుబ్బాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన చలివేంద్రం సేవా కార్యక్రమం 60 రోజుల పాటు విజయవంతంగా కొనసాగింది. ఈరోజుతో ముగిసింది. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. భాస్కర్ మాట్లాడుతూ, తీవ్రమైన వేసవి కాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సీపీఎం పార్టీ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత 60 రోజులుగా ప్రజలకు నిరంతరంగా సేవలు అందించడం సంతోషకరమని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడటతూ, కార్మికులు,కర్షకుల సమస్యల పై మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరంతరంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజల అవసరాల సమయంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సీపీఎం పార్టీ బాధ్యతగా భావిస్తుందని అన్నారు. ఈ చలివేంద్రం నిర్వహణకు ప్రత్యక్షంగా,పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, పట్టణ కమిటీ సభ్యులు ఎండీ సాజిత్, బత్తుల రాజు, బుల్లెట్ రాజు, లక్ష్మీనారాయణ, మెరుగు రాజు, లక్ష్మీనర్సయ్య, కానుగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆర్చరీ ప్రీమియర్ లీగ్-2

హైదరాబాద్, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : దేశంలోనే తొలి ఫ్రాంచైజీ ఆధారిత ఆర్చరీ టోర్నమెంట్ ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్ అక్టోబర్ 8 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరగనుందని లీగ్ డైరెక్టర్ అనిల్ కామినేని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఏఐ సెక్రటరీ జనరల్, ఏపీఎల్ డైరెక్టర్ వీరేంద్ర సచ్‌దేవా తోకలసి ఆయన మాట్లాడుతూ ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్వహించే ఈ 11 రోజుల లీగ్‌లో ప్రపంచస్థాయి ఆర్చర్లు పాల్గొంటారని తెలిపారు. భారత ఆర్చర్లకు అంతర్జాతీయ స్థాయి పోటీ అనుభవం కల్పించి ఒలింపిక్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ లీగ్ దోహద పడుతుందని అన్నారు.

## రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్-2 హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌గా మాన్యుల్ మొరెనో




హైదరాబాద్, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) సీజన్-2 కోసం హైదరాబాద్ హీరోస్ జట్టు కెప్టెన్‌గా స్పెయిన్ స్టార్ మాన్యుల్ మొరెనో, వైస్ కెప్టెన్‌గా భారత ఆటగాడు సుమిత్ కుమార్ రాయ్‌ను నియమించినట్లు ఆర్‌పీఎల్ సహ యజమాని శ్రీనాథ్ చిట్టూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి గచ్చిబౌలి స్టేడియంలో లీగ్ ప్రారంభం కానుందని తెలిపారు. గత సీజన్‌లో కాంస్య పతకం సాధించిన జట్టు ఈసారి స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతోందని చెప్పారు. వరల్డ్ రగ్బీ హాల్ ఆఫ్ ఫేమ్ సభ్యుడు డీజే ఫోర్బ్స్ మరోసారి జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హీరోస్ జట్టులో కెవిన్ వెక్సా, రెగన్ వేర్, మౌరైజ్ లాంగ్‌బాటమ్, ఫ్రాన్సిస్కో కాసెల్లా, వోల్ఫమ్ హకర్, రవుమా సెరువకుల, డిగో ఆర్డో, టిటియాఫోనో తవిట, సంబిత్ ప్రధాన్, శివమ్ శుక్లా, రాజన్ రావత్, మహమ్మద్ అనస్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ హీరోస్ తమ తొలి మ్యాచ్‌లో జూన్ 16న బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌తో తలపడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రగ్బీ ఇండియా అధ్యక్షుడు, లీగ్ కమిషనర్ రాహుల్ బోస్, జీఎంఆర్ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ సుజయ్ గంగూలీ పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీ చేసే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలను వెంటనే మూసివేయాలి**

**జేరిపోతుల జనార్ధన్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి,సిద్దిపేట**

**జిల్లాలో పుస్తకాలు, యూనిఫామ్ ల పేరుతో వ్యాపారం చేయనియొద్దని డీఈవో కి ఏఐఎస్ఎఫ్ వినతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 12 :సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతూ విద్యను వ్యాపార వస్తువుగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతే అటువంటి విద్యాసంస్థలపై జిల్లా యంత్రాంగం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ జిల్లా విద్యాధికారిని కోరారు.. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని కోరుతూ శుక్రవారం రోజున ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)వి.శాస్త్రి గారికివినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగాజేరిపోతుల జనార్దన్ మాట్లాడుతూ, విద్య అందరికీ హక్కు అయినప్పటికీ జిల్లాలో అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు దానిని లాభాల వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు నియంత్రణ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, ఇష్టారాజ్యంగా వేలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు.పాఠశాలల్లో ప్రవేశాల సమయంలో అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, అభివృద్ధి నిధులు, రవాణా చార్జీలు, ఇతర పేర్లతో అధిక మొత్తాలు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు.అంతేకాకుండా యాజమాన్యాలే నిర్దేశించిన దుకాణాల నుండి పుస్తకాలు, నోట్‌బుక్స్,యూనిఫాంలు కొనుగోలు చేయాలని బలవంతం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.. కేవలం నర్సరీ విద్యార్థికి సుమారు నాలుగువేల రూపాయల పుస్తకాలను అంటగట్టి తీవ్ర దోపిడీ చేస్తున్నారని పాఠ్యపుస్తకాలు యూనిఫాం నోటుబుక్కులను స్కూళ్లలో అమ్మకూడదని జిల్లా వ్యాప్తంగా డీఈఓ గారు సర్క్యులర్ జారీ చేయాలన్నారులి..జిల్లాలో ప్రభుత్వ అనుమతులు, గుర్తింపులు, అవసరమైన మౌలిక సదుపాయాలు లేకుండానే కొన్ని విద్యాసంస్థలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు, భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారే విధంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలను గుర్తించి వాటి అనుమతులను రద్దు చేయాలని కోరారు.ప్రభుత్వ ఉత్తర్వులను, విద్యాశాఖ మార్గదర్శకాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న సంస్థలపై భారీ జరిమానాలు విధించాలని, ప్రతి విద్యాసంస్థలో ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న కార్పొరేట్ విద్యా మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు,తల్లిదండ్రుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమైతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు,ధర్నాలు,విద్యాశాఖ కార్యాలయాల ముట్టడిలాంటి పోరాట కార్యక్రమాలుచేపడతామని హెచ్చరించారు. ఈమేరకుపలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేశారు..ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నంగెం మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్, నాయకులుమహేష్,శంకర్, రఘు తదితరులు పాల్గొన్నారు...

# భూసేకరణ సమీక్ష సమావేశం

**ఆర్ అండ్ ఆర్ ఎల్‌ఏ కమిషనర్ కె.శివకుమార్ నాయుడు**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర) : భూసేకరణ అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. శుక్రవారము వీడియో కాన్ఫరెన్సు హాలు నందు కే. శివకుమార్ నాయుడుతో కలిసి సమావేశము నిర్వహించారు.జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కమిషనర్ ఆధ్వర్యంలో చర్చా గోష్టి జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసేకరణ పనుల పురోగతి, భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారం, పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులు చర్చించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ యజమానుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ, ప్రాజెక్టుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఫేస్ -2 వికారాబాద్ జిల్లా గ్రావిటి కెనాల్ 1,2,3 బొంరాస్ పెట్, దుద్యాల్, కోడంగల్, దౌల్తాబాద్ మండలాలలో 1413 ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 1090 ఎకరాలకు ప్రతి పాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా 323 ఎకరాలకు ప్రతి పాదనలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ సమక్షంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ సేకరణ ప్రభుత్వ నిబంధనల ప్రకారము వంద శాతం పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటా చారి, డి ఆర్ ఓ అనిత, ఇరిగేషన్ ఎస్ ఇ శ్రీధర్, ఇ ఇ సులేమాన్, సెక్షన్ సుపరింతెన్డేంట్ నఫీజ్ ఫాతిమ ,తహసిల్దార్లు రాంబాబు, కిషన్, వెంకట స్వామి,డి ఇ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి సహకరించాలి

**-జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12 ( విజన్ ఆంధ్ర ) : బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత సూచించారు. శుక్రవారం ప్రత్యేక ఇంటెన్సివ్ పునః పరిశీలన (ఎస్ ఆర్ ఐ)లో భాగంగా బూతు స్థాయి ఏజెంట్ల నియామకం, మ్యాపింగ్ ప్రక్రియ, ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు తదితర అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన వికారాబాద్ నియోజ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ... ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేనట్లయితే ఎస్ఐఆర్ పారదర్శకంగా ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్ లను నియమించడం లేదని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బిఎల్ఏ ల జాబితాలను తప్పని సరిగా సమర్పించాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో బూతు స్థాయి అధికారులను సంప్రదించి బోగస్, డబుల్, మరణించిన ఓటర్ల ను తొలగించే విషయంలో స్థానికంగా ఉన్న బిఎల్ఏ ల సహకారం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. పూర్తిస్థాయిలో బిఎల్ఏ ల జాబితాను సమర్పించాలని ఆమె తెలిపారు. ఓటర్ జాబితాకు సంబంధించి ఏవైనా తప్పులు దొర్లినట్లయితే ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రజలకు సూచించాలని వివిధ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ తహసీల్దార్ లు పాల్గొన్నారు.

# నంద్యాలలో... వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన.. భారీర్యాలీ

నంద్యాల .జూన్ 12:నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నంద్యాల నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు....అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని.. అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్....నంద్యాల శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విధ్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు."విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతాలనికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు.

## అథ్లెటిక్స్ లో ప్రతిభ చాటిన శ్రీ అనంతపద్మనాభ కళాశాల విద్యార్థి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12 ( విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో శ్రీ అనంత పద్మనాభ కళాశాల విద్యార్థికి కాంస్య పతకం. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో వికారాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన శ్రీ అనంత పద్మనాభ కళాశాల బి.ఏ. ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాఘవేందర్ అద్భుత ప్రతిభ కనబరిచి 400 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం (బ్రాంజ్ మెడల్) సాధించాడు. రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన రాఘవేందర్‌ను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ జి. రామచంద్రయ్య , వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించి కళాశాలకు, జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

# 75 ఏళ్ల వృద్ధుడికి 'టీఏవీఐ'తో పునర్జన్మ!



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర)తీవ్రమైన గుండె వాల్వ్ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 75 ఏళ్ల వృద్ధుడికి హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక, అత్యంత అరుదైన 'ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్' ( టి ఏ వి ఐ ) ప్రక్రియ ద్వారా విజయవంతంగా చికిత్స అందించి నూతన జీవితాన్ని ప్రసాదించారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన వంటేరు మల్లయ్య (75) అనే వృద్ధుడు తీవ్రమైన 'కాల్సిఫిక్ అయోర్టిక్ స్టెనోసిస్' (గుండె వాల్వ్ కుంచించుకుపోయి రక్తప్రసరణ ఆగిపోయే వ్యాధి) సమస్యతో శ్వాస తీసుకోలేక, ఛాతీ నొప్పితో యశోదా ఆసుపత్రిని ఆశ్రయించారు. వయసు రీత్యా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం ప్రమాదకరం కావడంతో, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. వెంకట్ రెడ్డి బి. ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్రచికిత్స లేకుండా 'టీఏవీఐ' ప్రక్రియను విజయవంతంగా నిర్వహించింది.ఎచికిత్సలోని ముఖ్యాంశాలు:కోత లేని వైద్యం: ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా, కేవలం కాథెటర్ ద్వారా 'మెరిల్ మైవాల్' కృత్రిమ అయోర్టిక్ వాల్వ్‌ను అమర్చారు.ఎమెరుగైన ఫలితం: వాల్వ్‌పై ఉన్న ఒత్తిడి (గ్రేడియెంట్) 70 ఎఎంఎస్త్ర నుంచి 9 ఎఎంస్త్రకు తగ్గి, గుండె పనితీరు తక్షణమే మెరుగైంది.ఎవేగంగా రికవరీ: ఎటువంటి శస్త్రచికిత్సానంతర సమస్యలు లేకుండా రోగి వేగంగా కోలుకున్నారు. సీనియర్ జనరల్ ఫిజీషియన్ & డయాబెటాలజిస్ట్ డా. కృష్ణమోహన్ రెడ్డి.జి సమన్వయంతో రోగి ఇతర ఆరోగ్య సమస్యలను (డయాబెటిస్, రక్తపోటు) నియంత్రిస్తూ ప్రత్యేక పర్యవేక్షణ అందించారు. పూర్తి ఆరోగ్యవంతుడైన రోగిని వైద్యుల సూచనలతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.ఎవైద్యుల మరియు యాజమాన్యం స్పందనఃవృద్ధుల్లో ప్రాణాపాయంగా మారే వాల్వ్ సమస్యలకు 'టీఏవీఐ' ఒక అద్భుత ప్రత్యామ్నాయమని డా. వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్స్ సేవలకు తమ ఆసుపత్రి అంతర్జాతీయ ప్రమాణాలతో అగ్రగామిగా నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం

**-ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్న అనంత కిషన్**



సంగారెడ్డి బ్యూరో, జూన్ :12 (విజన్ ఆంధ్ర)ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు తోపాజి అనంత కిషన్ శనివారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ నగరంలోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సభలో మాట్లాడిన తోపాజి అనంత కిషన్ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణతో పాటు సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధి, యువత ప్రోత్సాహం, విద్యార్థులకు సహాయం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని, సమాజ అభ్యున్నతే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధిలో యువ నాయకులు ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. తోపాజి అనంత కిషన్‌కు మంచి సేవా భావం ఉందని, ఆయన నాయకత్వంలో సమాజానికి మరింత సేవ అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో విద్య, వ్యాపారం, సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు మరింత ముందుకు సాగాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంత కిషన్ సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సమాజ ప్రయోజనాల కోసం ఆయన సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, యువ నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొని తోపాజి అనంత కిషన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఘన సన్మానం నిర్వహించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# వెంకటాపూర్ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి

**భూ కబ్జాదారులను కాపాడే యత్నం**

**అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**సిపిఐ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా**

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర) : హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపూర్ గ్రామం లో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామ రైతులు, పేదలు ధర్నా నిర్వహించారు . ఈ ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం హాజరై మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములను కొందరు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో పేదల అసైన్డ్ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని, వాటిని అధికారులు రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.వెంకటాపూర్ అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూ కబ్జా దారులను నుండి భూమిని స్వాధీన చేసుకోవాలని అన్నారు. అట్టి అసైన్డ్ భూమిని తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూ కబ్జా దారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాపూర్ లో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం స్పందించని ఎడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు పంపిణీ చేస్తామని అన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టాలు ఉపయోగించి కేసులు నమోదు చేయాలని, భూకబ్జాదారుల కొమ్ము కాస్తూ వారికి సహకరించిన రెవెన్యూ అధికారుల సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా నాయకులు ఎదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

## 1000 కి.మీ సైకిల్ యాత్రకు గుర్తింపుగా ఓరగంటి రంజిత్‌కు ఇండియన్ వరల్డ్ రికార్డ్

### తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12విజన్ ఆంధ్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 13 జిల్లాల మీదుగా 17 రోజుల పాటు నిర్వహించిన 1000 కి.మీ సైకిల్ యాత్రకు గుర్తింపుగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలం, గోలేటి గ్రామానికి చెందిన వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఓరగంటి రంజిత్ కుమార్ కు ఇండియన్ వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ సంస్థల నుంచి సర్టిఫికెట్లు లభించాయి. ఈ సందర్భంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె హరిత, రంజిత్‌కు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం యువతలో అవగాహన పెంపొందించే లక్ష్యంతో 1000 కి.మీ సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సందేశాన్ని తీసుకెళ్లిన రంజిత్ కృషి ప్రశంసనీయమని కొనియాడారు. యువత సామాజిక సమస్యలపై స్పందిస్తూ ముందుకు రావాలని సూచించారు.

## పిల్లలమర్రి అభివృద్ధికి మరో ముందడుగు



సూర్యాపేట జూన్ 12:(విజన్ ఆంధ్ర)పిల్లలమర్రి ప్రజల కొరకు రూ.28 లక్షల వ్యయంతో ఓ ఎం నిధుల ద్వారా నిర్మించనున్న డబుల్ లైన్ రోడ్డు పనులకు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలో పిల్లలమర్రి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలమర్రి అభివృద్దే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కోడి నాగరాజు యాదవ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీమ్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, వెక్కంటి శేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎడ్ల గంగాభవాని, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు లక్ష్మాది, గుణగంటి సతీష్,నాగు నాయక్, పడిదల రవి, శివాలయం ఛైర్మన్ కొండ వెంకన్న, ముకుంద రెడ్డి, కోట్ల సైదులు, వెంకట్ లాల్, మాదగాని కేశవులు, మాదగాని లింగయ్య, సంద సైదులు, చిత్తలూరి సతీష్, లంజపెల్లి సురేశ్, మొగిలి ఎల్లయ్య, చేర్కుపల్లి చద్రశేఖర్, కంశెట్టి వంశీ, కోట్ల సంపత్, పాశం శేఖర్, కాంట్రాక్టర్ కోడిదల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలవస్థలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

**వాటర్ ట్యాంక్ పై కప్పు కూలడంతో భయాందోళనలో స్థానికులు**

**ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుబంటున్న కాలనీవాసులు**


**కొత్త వాటర్ ట్యాంకును నిర్మించాలని స్థానికులు నిరసన**



నారాయణపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో అమరగడ్డ మూడవ వార్డులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సుమారుగా నిర్మించి 40 సంవత్సరాలు పూర్తి కావడంతో, శిథిలావస్థకు చేరిందని స్థానికులు తెలిపారు. రాత్రి సుమారుగా 12 గంటల సమయంలో ఒక్కసారిగా వాటర్ ట్యాంక్ పైకప్పు కూలడంతో పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు ఒక్కసారిగా భయాందోళన చెందుతున్నారు.శిథిలావస్థకు చేరిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వల్ల చుట్టుపక్కల నివసించే స్థానికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు.శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును వెంటనే కొత్త వాటర్ ట్యాంకును నిర్మించాలని, అమరగడ్డ స్థానికులు నిరసన తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న వాటర్ దగ్గర చుట్టుపక్కల ఉన్న చిన్న పిల్లలు అక్కడే ఆడుతూ పాడుతూ ఉంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దానివల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును వెంటనే పునర్ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# కానిస్టేబుల్ ను బెదిరింపులకు గురి చేస్తున్న నర్స్

- విధుల వివరాలు లీక్ చేసి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని కానిస్టేబుల్ ఆరోపణ
- విధులకు ఆటంకం కలిగిస్తున్న నర్స్ ఆమె కుటుంబ సభ్యులు
- నల్గొండ టూ టౌన్ కానిస్టేబుల్‌పై సూర్యాపేట కానిస్టేబుల్ ఫిర్యాదు
- మొత్తం టూ టౌన్ కానిస్టేబుల్ చేపిస్తున్నాడని ఆరోపణ
- నాకు నా కుటుంబానికి ప్రాణహాని ఉంది.. మమ్ములను కాపాడండి



సూర్యాపేట జూన్ 12:(విజన్ ఆంధ్ర)తాను ఎక్కడ విధులు నిర్వహిస్తున్నానో తెలుసుకొని బయటి వ్యక్తులకు చేరవేసి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని సూర్యాపేట ఆర్ఓ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన నల్గొండ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం, నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఒక మహిళతో తనకు గొడవలు ఉన్నాయి. ఇరువురూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం జరిగింది. ఈ కేసులు ప్రస్తుతం కోర్టులో నడుస్తున్నాయి. అయితే నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక కానిస్టేబుల్ తన విధుల వివరాలను తెలుసుకొని నర్సు కి చేరవేస్తున్నాడని లక్ష్మీనారాయణ ఆరోపించారు. దీంతో ఆమె మరియు ఆమె బంధువులు రాత్రి సమయంలో తాను పనిచేసే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. గత సంవత్సరం సూర్యాపేట జిల్లా భరోసా సెంటర్‌లో పనిచేస్తున్న సమయంలో రాత్రి 1 గంటకు ఆమె, ఆమె తమ్ముడు, మరిది కలిసి అక్కడికి వచ్చారని, పాలకీడు మండలంలో పనిచేస్తున్నప్పుడు రాత్రి 2 గంటలకు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి బూతులు తిట్టారని పేర్కొన్నారు. క్యాన్సర్ బాధితురాలు అయిన మా తల్లికి ఆరోగ్యం బాగలేకపోవడంతో హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ లో ట్రీట్మెంట్ చేపించుకోవడం కొరకు వెళ్తే నేను లేనిది చూసి మా తల్లితో ఆమె, వాళ్ళ తమ్ముడు ఇబ్బందులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. మా భార్య కు మీ పిల్లలను చంపేస్తానని మెసేజ్లు పెడుతూ భయానికి గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అప్పటి ఎస్పి కి చెప్పి పలుమార్లు బదిలీ చేయించుకున్నానని, అయినా ఆమె తనను వెంబడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వారిపై సూర్యాపేట కోర్టులో అటెంప్ట్ మర్డర్ కేసు, నల్గొండ వన్ టౌన్‌లో మరో కేసు నడుస్తున్నాయని తెలిపారు. టూ టౌన్ కానిస్టేబుల్ తన వివరాలను లీక్ చేసి దాడికి సహకరిస్తున్నాడని, దీంతో ఇప్పటివరకు మూడు పోలీస్ స్టేషన్లు మారాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. తనకు మరియు కుటుంబానికి ప్రాణహాని ఉందని, మానసికంగా ఇబ్బంది పడుతున్నానని, వెంటనే చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని ఎస్పి ని కోరారు. పోలీస్ శాఖలో ఒక కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్ వివరాలను బయటి వ్యక్తులకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. అంతేకాకుండా స్టాఫ్ నర్సు నల్గొండ ప్రభుత్వాసుపత్రిలోని ప్రభుత్వ మెడిసిన్స్ బయట వ్యక్తులకు అమ్ముతున్నట్టు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. వాటి విషయంలో విచారణ కూడా జరుగుతుందని సమాచారం...

## పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శక సూత్రాలు

**–బీజేపీ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి**



సూర్యాపేట జూన్ 12:(విజన్ ఆంధ్ర)పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శక సూత్రాలని బీజేపీ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు గృహాలు అందించగా, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉజ్వల యోజన కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచినట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని, పంట బీమా పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య భద్రత అందుతుండగా, జన ఔషధి కేంద్రాల ద్వారా నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇచ్చి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సెమీకండక్టర్ తయారీ వంటి రంగాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భారత్‌ను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు వేస్తోందన్నారు. నక్సలిజం నిర్మూలనలో కూడా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని పేర్కొంటూ, భద్రతా దళాల త్యాగాలు, సమర్థ వ్యూహాల ఫలితంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి వాతావరణం నెలకొంటోందన్నారు. దేశ భద్రత, ఆర్థిక పురోగతి, సామాజిక సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చిన ఆయన, దేశ ప్రయోజనాలు, జాతీయ భద్రత, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శక సూత్రాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రుక్మారావు,చల్లమల్ల నరసింహా, ఫణి మన్మధ రెడ్డి సాయి రెడ్డి గజ్జల వెంకట్ రెడ్డి, పృథ్వి, రవివర్మ, పరశు రాములు,బిజెపి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం నిరంతర పోరాటం

**– రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుని అధ్యక్షులు విరహాలీ**



సిద్దిపేట జిల్లా జూన్ 12 ప్రతినిధిరాష్ట్రంలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డుల కోసం నిరంతర పోరాటం చేయడం జరుగుతుందని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట యూనియన్ అధ్యక్షులు విరహత్ అలీ చెప్పారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా వర్కింగ్ మహాసభలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు . జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ జిల్లా అధ్యక్షులు రజినీకాంత్ మున్సిపల్ చైర్మన్ ఉమారాణి శ్రీనివాస్ జర్నలిస్టులు ఉన్నారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ధ్యేయం

**ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం..**

**ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి**

**ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా పనిచేయాలి**

**ఓటర్ల జాబితా సవరణలో ప్రతి బూత్ ఏజెంట్ కీలక పాత్ర పోషించాలి.**

**వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర) ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్తంభమని, ఆ హక్కును కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు పేర్కొన్నారు. హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, హన్మకొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర ప్రియాంక – పులి అనిల్ తో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇన్చార్జులు, ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీ కడియం కావ్య గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి కార్యకలాపాలు, ఓటరు నమోదు మరియు ఎన్నికల నిర్వహణలో బూత్ ఏజెంట్ల బాధ్యతలపై సవివరంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు నమోదు విధానాలు, కొత్త ఓటర్ల చేర్పు, మార్పులు, తొలగింపులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియల గురించి సమగ్రంగా వివరించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పోరాటం చేస్తోందని అన్నారు. దేశ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైనదని, ఆ హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ హరించనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రజల ఓట్లు ప్రజలకే చెందాలని, రాజకీయ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితాల్లో అక్రమాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. అదే సమయంలో అక్రమంగా పేర్లు తొలగించడం, అనర్హులను చేర్చడం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేదా పార్టీ నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరై ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని బూత్ ఏజెంట్లకు సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా బూత్ స్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాల్లో జరుగుతున్న అక్రమాలు, దొంగ ఓట్ల చేర్పు, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా "ఓటు చోరీ" పేరుతో పెద్ద ఎత్తున అవగాహన మరియు ఉద్యమ కార్యక్రమాలను చేపట్టిందని ఎమ్మెల్యే నాగరాజు గారు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) మూడో దశ కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు సహకరించడంతో పాటు, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి బూత్‌ను కాంగ్రెస్ పార్టీకి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా బూత్ ఏజెంట్లలో ఎన్నికల ప్రక్రియపై మరింత అవగాహన పెరిగిందని, రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత సమర్థవంతంగా పనిచేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పాల్గొన్న బూత్ ఏజెంట్లు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# బాలికపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

**రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12 ( విజన్ ఆంధ్ర ) : ఖమ్మం జిల్లాలో ఓ మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటన పట్ల భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నిమ్స్ హాస్పిటల్ లో బాలికను రాష్ట్ర మెడికల్ సెల్ కో కన్వీనర్ డాక్టర్ రష్మీ కండ్లికర్, డాక్టర్ సుమన్ లతో కలిసి బాధితురాలిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాంపాడు గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక వేసవి సెలవుల సందర్భంగా ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో నివసిస్తున్న తన తాతయ్య, అమ్మమ్మల ఇంటికి వెళ్లింది. అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు అత్యంత కలచివేసే విషయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఘటన బయటపడుతుందనే భయంతో బాలికను భవనం పై అంతస్తు నుంచి కిందకు తోసివేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడిందని, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని సమాచారం అందుతోందన్నారు. శరీరంలోని పలు అవయవాలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలైనట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనను తెలంగాణ రాష్ట్ర బీజేపీ మెడికల్ సెల్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఇంతటి ఘోర నేరం జరిగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత మంత్రులు, మహిళా సంక్షేమ శాఖ ప్రతినిధులు తక్షణ స్పందన చూపకపోవడం బాధాకరమన్నారు. నిందితుడిపై నేర తీవ్రతకు అనుగుణంగా అన్ని సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు, పౌర సమాజ సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బాలికకు అత్యుత్తమ వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలని, చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. అలాగే బాధితురాలి కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి, బాలికకు సాధ్యమైనంత ఉత్తమ వైద్య చికిత్స అందించాలని కోరినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి బాధితురాలి కుటుంబానికి అండగా నిలవాలని, నిందితుడికి అత్యంత కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలి




నారాయణపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రభుత్వం గురుకుల మరియు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి గురుకుల మరియు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు హెచ్. నర్సింహా, తిరుపతి, వెంకటేష్, రాధ కిషన్, శివ అమర్ ఒక ప్రకటనలో కోరారు . ఇటీవల ప్రభుత్వం నిరుద్యోగుల గరిష్ట వయోపరిమితి 44 సంవత్సరాలు పొడిగించి ఒక సంవత్సరం వరకు ప్రభుత్వ ఉద్యోగాలకు వ్రాత పరీక్షలు వ్రాసి ఉద్యోగాలు పొందే అవకాశం ఇచ్చింది. ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటిస్తే 44 సంవత్సరాలు ఉన్న వారికి చివరి అవకాశం గా ఈ వ్రాత పరీక్షలు రాసుకోవచ్చు.ఒకవేళ నోటిఫికేషన్ వేయకుండా కాలయాపన చేస్తే 44 సంవత్సరాలు ఉన్న చాలా మంది నిరుద్యోగులు పరీక్షలు వ్రాయకుండానే వయోపరిమితి పూర్తి అయ్యే ప్రమాదం ఉంది కావున వయోపరిమితి పెంచి కూడా నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు ఆవేదన వ్యక్తం చేశారు.

## పర్యావరణ పరిరక్షణకే 'గ్రీన్ ఎనర్జీ' - మంత్రి పొంగులేటి

- పాలేరు పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ పనులు
- తిరుమలాయపాలెంలో సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 12 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, విద్యుత్ నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్ల) మరమ్మత్తు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ సరఫరా మెరుగుదలకు పనులు చేపట్టామని, రూ.9 కోట్ల వ్యయంతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు. దశాబ్దాలుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఒకప్పుడు కరెంట్ కష్టాలతో రాత్రివేళల్లో పొలాలకెళ్లి రైతులు పాముకాట్లకు గురైన పరిస్థితులు ఉండేవని, నాటి ఉచిత విద్యుత్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంట్ అందిస్తోందని గుర్తుచేశారు.

రైతాంగానికి భరోసారాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచామన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతులకు అండగా నిలిచామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలు అవుతున్నాయని అన్నారు. గడిచిన ఏడాది కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యం కోసం రూ.1,034 కోట్లు వెచ్చించామని, నిరుద్యోగుల కోసం 72 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారీ, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, యూనిఫాంల పంపిణీ**

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని పిలుపు**

చందుర్తి, జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో):ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన బోధనపై ప్రజలకు అవగాహన కల్పించి విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని గొల్లపల్లిలో రెండు సంవత్సరాలుగా మూతపడిన ప్రాథమిక పాఠశాలను ఆమె పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం కిష్టంపేటలోని పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఆటవస్తువులు, విద్యా సామగ్రిని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, కొత్తగా చేరిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. పూర్వ ప్రాథమిక విద్యలో ఆటల ద్వారా అభ్యాసానికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్న ఆమె, చిన్నారులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుతో పాటు ఆటల్లోనూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, విద్యాశాఖ అధికారులు వినయ్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# చేసిన అభివృద్ధి, సంక్షేమం మేం చెప్తాం పదేళ్లలో మీరు చేసింది చెప్పగలరా..

**అభివృద్ధి చేయలేనోళ్ళు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదం..**

**రెండున్నర కాలంలో 47 వ డివిజన్ లో 6 కోట్ల పై చిలుకు అభివృద్ధి చేశాం..**

**కాజిపేట గత పాలనలో ఎలా ఉందో ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనిస్తున్నారు...**

**47 వ డివిజన్ లో ఎమ్మెల్యే నాయిని రూ.125 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన...**

**ఎస్ ఐ ఆర్ , బూత్ ఏజెంట్ల పక్రియ వేగవంతం చేయాలని నాయకులకు దిశా నిర్దేశం..**

హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర)చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి మేం ధైర్యంగా ప్రజలకు చెబుతున్నామని పదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ, ఇంపీరియల్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని, అభివృద్ధి పనుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. అభివృద్ధి చేయలేని వారు, ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కాజీపేట ప్రాంతం గత పాలనలో ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# వారాంతపు మార్కెట్ యార్డ్ ను సద్వినియోగం చేసుకోవాలి

**- పేట లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పునః ప్రారంభించిన కలెక్టర్**

నారాయణపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) వారాంతపు మార్కెట్ యార్డ్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్) యార్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సమీకృత మార్కెట్ యార్డులో వివిధ రకాల సేంద్రీయ కూరగాయలు పండ్లు పూల ఉత్పత్తులు ఆహార ధాన్యాలు మహిళా సంఘాల ఉత్పత్తులు రాగి లడ్డూలు జనపనార సంచులు మట్టి కుండలు మట్టి ఆభరణాలు పచ్చళ్ళు వెదురు ఉత్పత్తులు చేనేత చీరలు హస్తకళ ఉత్పత్తులు కళాకారుల కుమ్మరి ఉత్పత్తులు జనపనార తదితర వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించటానికి ముఖ్య ఉద్దేశ్యం నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి అని తెలిపారు. సేంద్రీయ ఎరువులు తయారీ వాటి ప్రదర్శన అమ్మకాలు స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు ఆన్ లైన్ ద్వారా అమ్మకాలు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసే ఉత్పత్తులు వాటిని ప్రజలు ఆదరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం లో ఒక శుక్రవారం ఇక్కడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో ఆయా ఉత్పత్తులు



అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు వారంతపు మార్కెట్ ను ఉపయోగించుకుని రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు కొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ కమిషనర్, డిఆర్డిఏ , హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు సమన్వయంతో ప్రతి శుక్రవారం ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, పుర కమీషనర్ శంకర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, కౌన్సిలర్ భరత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు అరుంధతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బండి వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖ. హరిత




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12: విజన్ ఆంధ్ర నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణను అందించి, వారి భవిష్యత్తుకు తోడ్పడేలా నిర్మిస్తున్న 'స్కిల్స్ సెంటర్' భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో పాత కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో రూ. 70 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ధర్మేందర్ గారితో కలిసి కలెక్టర్ గారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం (Aspirational Districts Programme)లో భాగంగా రూ. 70 లక్షల నిధులతో ఈ స్కిల్స్ సెంటర్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ అందుబాటులోకి రావడం వల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ (Skill Training) అందించి, వారు స్వయం ఉపాధి పొందేందుకు మరియు సొంతంగా ఎదిగేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని అన్నారు. భవన నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పెండింగ్ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి, భవనాన్ని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్. ఈఈ (జుజు) ధర్మేందర్, జిల్లా సమన్వయకర్త సాంబశివరావు, ఏఈ (ఙాజు) గోపాల్, టాస్క్ జిల్లా మేనేజర్ రాకేష్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు వేగం.. అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ కీలక ఆదేశాలు

**హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహణ**


రాజన్న సిరిసిల్ల, జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు జిల్లాలో 7,367 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో 5,798 ఇళ్లకు ముగ్గు పోయగా, 5,014 ఇళ్లు బేస్‌మెంట్ దశకు, 4,362 ఇళ్లు గోడల నిర్మాణ దశకు, 4,012 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికే 2,834 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించిన లబ్ధిదారులు దశలవారీగా పనులను పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఎంపీడీఓలు గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. లబ్ధిదారులకు ఇటుకలు, నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. మేస్త్రీలు, వడ్రంగులు తదితర పనివారి వివరాలను



లబ్ధిదారులకు అందించి నిర్మాణాల్లో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణాల పురోగతికి సంబంధించిన ఫోటోలను హౌసింగ్ ఏఈలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా నిధులు జమ అవుతున్నాయని చెప్పారు. జిల్లాలో ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు పాల్గొన్నారు.

# ఆస్పత్రి నిర్వహణ పట్ల పోచారం సంతృప్తి

బాన్సువాడ జూన్ 12 (విజన్ ఆంధ్ర). ఆస్పత్రి నిర్వహణ పట్ల శుక్రవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. బాన్సువాడ పట్టణ కేంద్రం లోని ఏరియా ఆసుపత్రి, మాత శిశు సంక్షేమ ఆసుపత్రి నిర్వహణ, పనితీరు పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు, ఆసుపత్రి అడ్వైసరి కమిటీ అధ్యక్షులు పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, బాన్సువాడ ఆర్డీవో. రవీందర్ రెడ్డి, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. విజయ్ భాస్కర్. ఈ



కార్యక్రమం లో అడ్వైసరి కమిటీ సభ్యులు, పట్టణ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత జోలి శాఖ అధికారికి వినతి




నారాయణపేట, జోన్ 12 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కేంద్రంలోని జిల్లా చేనేత జ్యువలరీ శాఖ అధికారి వినతి పత్రం సమర్పించినట్లు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపడం లేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా చేనేత కార్మికులకు ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలను అందించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పి గత ప్రభుత్వం ఎన్నో ఆశలు చెప్పి కార్మికులను నట్టేట ముంచిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేనేత కార్మికులను ప్రభుత్వ పరంగా వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12: విజన్ ఆంధ్రప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎమ్. డేవిడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన, కంప్యూటర్ డేటా ఎంట్రీ, నమోదు మరియు శిక్షణ కార్యక్రమంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మరియు మండల స్థాయిలో ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. బాధితులకు అర్థమయ్యే రీతిలో, సత్వరమే వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తుల నమోదు ప్రక్రియ మరియు ప్రగతిని పీపీటీ (ఙూ) ద్వారా ఈ సమావేశంలో వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు (ఙీణాం), సెక్షన్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈడీఎం (జుణవీ) మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మంచిర్యాల కు ఉప ముంఖ్యమంత్రి బట్టి రాక

**గూడెం ఆలయం పునర్నిర్మాణానికి భూమి పూజ**

**సింగరేణి లో నియామక పత్రాలు అందజేత**

**మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ఏర్పాటు చేసిన భాహిరంగ సభలో మంచిర్యాల జిల్లా గూడెం దేవస్థానం అభివృద్ధికి రూ,70 కోట్లు ప్రకటించడం జరిగిందని, ఇచ్చిన హామీ ప్రకారం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన 36 రోజుల్లోనే శంకుస్థాపన చేసుకోవడం చాలా గర్వకారణమని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడారు. నేడు గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రానున్నారని అన్నారు. రూ,70 కోట్లతో ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని తన అభ్యర్థన మేరకు పిప్పిరి సభలో సీఎం రేవంత్ రెడ్డి మాటిచ్చారని, అన్నట్టుగానే నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలయ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మరియు మంత్రుల బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలకు సంబంధించి, ఉద్యోగ నియామక పత్రాలను మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేస్తారని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. మంచిర్యాల పట్టణంలో సుమారు 40 మంది సింగరేణి కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం శ్రీరాంపూర్ సింగరేణి ఓపెన్ కాస్ట్ గని ని సందర్శిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ పునః నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మరుసటి రోజు ఆదివారం పద్మావతి గార్డెన్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు మరియు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - సర్ పై బూత్ లెవెల్ ఏజెంట్ (బిల్ ఏ ) లకు అవగాహన, శిక్షణ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు, నాయకులు,మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పసిపాపపై పశువులా వ్యవహరించిన నిందితుడు మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలి

### ఖమ్మం ఘటనను ఖండించిన నారాయణపేట జిల్లా విశ్వహిందూ పరిషత్

నారాయణపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) ఖమ్మం లో పసిపాపపై పశువులా వ్యవహరించిన నిందితుడు మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలని నారాయణపేట జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కన్న శివకుమార్, టౌన్ ప్రెసిడెంట్ మురళి భట్టడ్, బజరంగ్దళ్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్, కడుదాస్ ప్రవీణ్ లు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. నిందితుడిని కాపాడే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్న ఘటన అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, బాధితురాలి హెల్త్ బుల్లెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు శిక్షలు భయపడేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. నేరాలను ఖండించే విషయంలో కులం, మతం, రాజకీయ అనుబంధాలు ప్రామాణికంగా మారకూడదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై జూడీషినల్ విచారణ జరిపించాలని వారు ఇచ్చిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ టాపర్లకు కలెక్టర్ చేతుల మీదుగా నగదు పురస్కారాలు

### –అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించిన గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో):విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు ఆమె నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు.

తంగళ్లపల్లి మండలంలోని టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు.ఎంపీసీ విభాగానికి చెందిన బుష్రా కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు సాధించగా, బైపీసీ విభాగానికి చెందిన ఎం. నందిని 977 మార్కులు సాధించారు. వారి ప్రతిభను గుర్తిస్తూ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.30 వేల నగదు పురస్కారాన్ని కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించిన కలెక్టర్, భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మోగిన బడి గంట

హోళగుంద, :మండల వ్యాప్తంగా శుక్రవారం బడి గంట మోగింది.ప్రధానంగా వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థి,విద్యార్థినీయులు బడి బాట పట్టారు.దీంతో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ముందుగానే ఉపాధ్యాయులు పాఠశాలలను పరిశుభ్రం చేయించారు.అలాగే ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆయా పాఠశాలకు పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ - 1 సుధా రాణి,ఎంఈఓ - 2 కబీర్ సబ్ పాత్రికేయులకు తెలిపారు.

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు

### –జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,(విజన్ ఆంధ్రఈ నెల 13వ తేదీన జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్



ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డి.సి.పి., మంచిర్యాల శాసనసభ్యులు, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బడిబాట విద్యార్థి భవిష్యత్తు పట్ల ఉజ్వల బాట

### ప్రభుత్వ పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదైతే వాళ్లను ప్రయోజకులను చేసే బాధ్యత ఉపాధ్యాయులది. బేతాళ పాడు సర్పంచ్ గుగులోతు సునీత మహేష్.

జూలూరుపాడు జూన్ 13 (విజన్ ఆంధ్ర) జూలూరుపాడు మండలం లో బడిబాట కార్యక్రమం నిర్వహించిన మండల విద్యాధికారి ఆదేశాలకు అనుగుణంగా బడిబాట కార్యక్రమంలో బేతలపాడు గ్రామపంచాయతీలో సర్పంచ్ గుగులోతు సునీత మహేష్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి వాసరామ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం ఉద్యోగులు అంగన్వాడిలు ఆశ వర్కర్లు నడవ నిర్వహించిన బడిబాట అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత మహేష్ మాట్లాడుతూ మన గ్రామంలో మన విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏడో తరగతి లోపు పిల్లల తల్లిదండ్రులు బేతాలపాడు ప్రభుత్వ పాఠశాలలో చదివించి ప్రభుత్వానికి సహకరించడమే కాక ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు ఆర్థికంగా వెనకబడిన పిల్లల కోసం ప్రభుత్వం ఉచిత మధ్యాహ్న భోజన పథకం ఉచిత పాఠ్యపుస్తకాల పథకం ఉచిత దుస్తులు కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు అన్ని విధాల ఆర్థిక ఇబ్బందులు నుండి బయటపడొచ్చు అని కోరారు బెతలపాడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి వసరాం



మాట్లాడుతూ మంచి డిగ్రీలు సంపాదించిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో చదువులు పట్ల నైపుణ్యత కలిగిన ఉన్నారు. దీన్ని గమనించి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించుటకు ముందుకు రావాలని మాకు అవకాశం ఇవ్వండి మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తాము అని హామీ ఇచ్చారు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా వారి కళ నైపుణ్యాన్ని వెలికి తీసి చూపిస్తాము అని మంచి వాతావరణం లో నిబద్ధత కలిగిన చదువు తో పాటు క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన బహుశత్ ను తల్లిదండ్రులకు అందించి చూపిస్తామని తెలిపారు. ఇకనుండి ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో భాగస్వామ్యం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ధరావత్ బాలాజీ గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యమే లక్ష్యం పరిశుభ్రతపై రాజీ లేదు

### సానిటేషన్ సిబ్బంది సేవలను అభినందించిన దేవస్థాన ఈవో రమాదేవి

### సిబ్బందికి నెలకు నాలుగు సెలవులు మంజూరు

వేములవాడ, జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో పరిశుభ్రత నిర్వహణలో సానిటేషన్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎల్. రమాదేవి అన్నారు. దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సానిటేషన్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.వేసవి సెలవుల సమయంలో ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చినప్పటికీ ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలు, వసతి గృహాలు, పార్కింగ్ ప్రాంగణాల్లో పరిశుభ్రతను సమర్థవంతంగా నిర్వహించిన సిబ్బంది సేవలను ఈవో ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకితభావం వల్ల భక్తులకు మెరుగైన వాతావరణం అందిందని పేర్కొన్నారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు, క్రిమికీటకాల నివారణకు అవసరమైన సామగ్రిని వినియోగించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన, సురక్షిత వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని



తెలిపారు.సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలని, అనవసర సెలవులు నివారించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ఐడీ కార్డు ధరించడంతో పాటు నిర్ణీత డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.సానిటేషన్ సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెల నాలుగు సెలవులు మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.దేవస్థానానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని ఈవో రమాదేవి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఈవో భాస్కర్ శర్మ, ఏఈఓ అశోక్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పూజిత, ఆలయ ఉద్యోగులు, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలి

### – అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 12.కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి డాక్టర్ అశ్వని తానాజీ వాకడే ఐఏఎస్ గారు పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఎలగందల్, కొత్తపల్లి మండలంలోని విద్యాసంస్థలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ మరియు సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆమె, అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ మరియు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న అదనపు కలెక్టర్, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ గారు, ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్ గారు, కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మా ఆనందం గారు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటనపై నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

### ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా నిందితుడిని వెంటనేఉరి తీయాలి




సిద్దిపేట, జిల్లా ప్రతినిధి జూన్ 12: ఖమ్మంజిల్లాలో 12 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట విశ్వహిందూ పరిషత్ (వి హెచ్ పి), బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు.సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ గో రక్షక్ దళ్ రాష్ట్ర సభ్యుడు గ్యాదరి రాజారాం మాట్లాడుతూ, ఖమ్మం పట్టణంలో జరిగిన ఈ దారుణ ఘటన సమాజంతలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుని, నిందితుడికి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్ష విధించాలని కోరారు.మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నేరస్థులపై వేగవంతమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ బైరి మురళి, బోనాల శ్రీనివాస్, పొదిల శ్రీనివాస్, అజయ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పుష్కర పాలన ఎట్లుంది?

### ఆటో ఎక్కిన "బండి"

### మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై ఆటో డ్రైవర్ కు పుస్తకాలను అందించిన కేంద్ర మంత్రి

### మోదీ పాలనలో ప్రజలకు ఇష్టమైన కార్యక్రమాలేమిటని ఆరా తీసిన బండి సంజయ్

### కాంగ్రెస్ పాలనపైనా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 12..నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై వివరిస్తూ వివిధ వర్గాలను కలుస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఆటో డ్రైవర్ ను కలిశారు. ఆటోలో ఎక్కి కాసేపు ప్రయాణించారు. "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం హుస్నాబాద్ నియోజకవర్గం రేకొండ గ్రామానికి విచ్చేసిన బండి సంజయ్ తిరుగు ప్రయాణంలో రేకొండ ఆటో స్టాండ్ వద్ద ఆగారు. కరీంనగర్ వైపు వెళుతున్న ఆటోలో ఎక్కారు. దిలీప్ అనే ఆటో డ్రైవర్ ను పలకరిస్తూ... మోదీ 12 ఏళ్ల పాలన ఎట్లుందంటూ ఆరా తీశారు. "మోదీ గారు అనేక పథకాలను అమలు చేశారు. ఉచిత బియ్యం మోదీ ఇస్తున్నారు. ఉజ్వల గ్యాస్ ఇస్తున్నారు. గ్రామాలకు రోడ్లన్నీ మోదీ ప్రభుత్వం వేసినవే. జాతీయ రహదారుల పైసలన్నీ కేంద్రానివే. కరీంనగర్ జగిత్యాలకు నిధులు మంజూరు చేశారు. 12 లక్షల ఉద్యోగాలిచ్చారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు పెద్ద ఎత్తున పైసలిస్తున్నారు. ఆ నిధులతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి చెందుతున్నాయి"అని వివరించారు. "దేశంలో 4 వేల రోజులకుపైగా పాలన కొనసాగిస్తున్న ఏకైక ప్రధాని మోదీ. ఆయన నిరంతరం పేదల కోసమే పనిచేస్తున్నారు. పేదల పాలిట దేవుడు నరేంద్రమోదీ. ఆటో డ్రైవర్ గా నువ్వు రోజు కనీసం వంద మందినైనా కలుస్తుంటావ్. రాజకీయాలకు అతీతంగా మోదీ ఈ దేశానికి చేస్తున్న మంచి పనులను చెప్పాలి. మోదీగారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ దేశానికి మరింత సేవ చేయాలని కోరుకుందాం"అని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపైనా బండి సంజయ్ ఆరా తీశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల అసంతృప్తితో ఉన్నారంటూ ఆటో డ్రైవర్ బదులిచ్చారు. ఏ వర్గాలు ఎక్కువగా కోపంగా ఉన్నాయని అడిగితే "మా ఆటో ఎక్కే వాళ్లలో మహిళలు, వృద్ధులు కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు"అని పేర్కొనడం గమనార్హం. మోదీ పాలనను ప్రస్తావించగా 'యువకులు, మహిళలంతా మోదీ పాలన బాగుందంటున్నారు. నేను కూడా మోదీ అభిమానినే"అని బదులివ్వడం విశేషం. రేగొండ నుండి చిగురు మామిడి వరకు ఆటోలో ప్రయాణించిన బండి సంజయ్ అనంతరం చిగురుమామిడిలో దిగారు. మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించిన పుస్తకాలను ఆటో డ్రైవర్ దిలీప్ కు అందజేశారు. మోదీ పాలనా విజయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

## విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలి

### టి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.కన్నం సునీల్

హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 ( విజన్ ఆంధ్ర) టీఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో సుబేదారి ఆర్ట్స్ కళాశాల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించరు ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ. తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కలిసి విద్యా రంగంలో సమగ్ర మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితమైన విద్య కాకుండా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఉపాధి అవకాశాలకు దోహదపడే విద్యా విధానం అమలు కావాలని తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ( టి ఎస్ ఎఫ్ ) కోరుతోంది.ప్రస్తుతం విద్యా వ్యవస్థలో ఏఐ , కోడింగ్ , డిజిటల్ స్కిల్స్ , కమ్యూనికేషన్ స్కిల్స్ , ప్రాక్టికల్ లెర్నింగ్ వంటి అంశాలను సిలబస్‌లో చేర్చడం అత్యవసరం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ప్రతి పాఠశాలలో నాణ్యమైన ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలిప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి. తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అలాగే ప్రతి పాఠశాల, కళాశాలలో కెరీర్ గైడెన్స్, స్కిల్ ట్రైనింగ్, ఉపాధి



అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు మార్కులు, ర్యాంకులతో పాటు ప్రతిభ, సృజనాత్మకత, ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత డిజిటల్ శిక్షణ, ఇంగ్లీష్ భాషా మద్దతు, పోటీ పరీక్షల కోచింగ్ అందించాలి.విద్యా విధానాల రూపకల్పనలో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని టి ఎస్ ఎఫ్ కోరుతోంది.ముఖ్యమంత్రి "రేవంత్ రెడ్డి విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకోవాలి. విద్యాసంస్థలపై క్రమం తప్పకుండా తనిఖీలు, ఆడిట్లు నిర్వహించి విద్యా నాణ్యతను మెరుగుపరచాలి.ఈ సందర్భంగా టి ఎస్ ఎఫ్ ప్రభుత్వం విద్యా రంగాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా పరిగణించి సమగ్ర విద్యా సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తోంది.ఈ కార్యక్రమంలో రామంచ శ్రీను, మణితేజ, కిషోర్, సాంబరాజు, రామక్రిష్ణ, ఆర్ష తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సహజమని,చేసిన సేవలే చిరకాలం నిలిచిపోతాయి.

### –సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి

విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ : తొగుట మండలంలోని గుడి కందుల గ్రామంలోని రైతు వేదికలో బదిలీపై వెళుతున్న వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్,పంచాయతీ కార్యదర్శి రజని లకు గ్రామ సర్పంచ్ కన్నయ్య గారి లక్ష్మి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సహజమన్నారు. ఉద్యోగుల గ్రామాలలో చేసిన సేవలనే ప్రజలు గుర్తుపెట్టుకుంటారని అన్నారు. రాత్రింబవళ్లు గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగే ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు.గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్తులందరూ అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ



కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్,ఉపసర్పంచ్ పర్శయ్య,వార్డు సభ్యులు, నూతన పంచాయతీ కార్యదర్శి రవి, మాజీ సర్పంచ్ మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు గారి శ్రీకాంత్ రెడ్డి,లక్ష్మణ్, పరమేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

రాజన్న సిరిసిల్ల జూన్ 12 ( విజన్ ఆంధ్ర) జిల్లా : ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు.వారిలో ఇద్దరు దివ్యాంగులు.దివ్యాంగురాలైన సాగరిక,దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు.వారికి ప్రభుత్వ,ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు.ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు.పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది.కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు.

# శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు దాతల విశేష స్పందన



నారాయణపేట , జూన్ 12 ( విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతిష్టించనిన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు పట్టణ ప్రము ఖులు, దాతలు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్ గారు రూ. 1,16,000,డాక్టర్ ప్రసాద్ శెట్టి, రూ. 2,16,000, ప్రముఖ న్యాయవాది నందు నామాజీ గారు రూ. 1,16,000 విరాళంగా అందజేశారు. అలాగే డాక్టర్ గావినోళ్ల మధుసూదన్ రెడ్డి తమ వంతు సహాయాన్ని అందించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త జి ఆర్ రెడ్డి నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ మెటీరియల్‌తో పాటు రూ. 1,00,000 నగదు సహాయాన్ని ప్రకటించారు. అదేవిధంగా సీనియర్ నాయ కులు నాగరావు నామాజీ ని కలిసి నిర్మాణ కార్యక్రమ పురోగతిపై చర్చించి వారి అమూల్యమైన సూచనలు, సలహాలను కమిటీ సభ్యులు స్వీకరించారు. నారాయణపేటకు గర్వకారణమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని అత్యంత త్వరలో ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగుల వైద్యానికి కలెక్టర్ చేయూత రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

రాజన్న సిరిసిల్ల, జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగుల వైద్య చికిత్స కోసం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు ఉండగా, వారిలో సాగరిక, వేణు అనే ఇద్దరు దివ్యాంగులు అనారోగ్యానికి గురయ్యారు. వారి చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ఇప్పటికే కొమురవ్వ భర్త గల్ఫ్‌లో మరణించగా, కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో పాటు పిల్లల సంరక్షణ బాధ్యతల కారణంగా ఆమె కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. విషయాన్ని సానుకూలంగా పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ఆ మేరకు



రూ. 50 వేల చెక్కును అందజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సంక్షేమ, సహాయ కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజంను కలెక్టర్ ఆదేశించారు. తమ కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన జిల్లా కలెక్టర్‌కు కళ్యాణం కొమురవ్వ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

# సూపరింటెండెంట్‌ను సన్మానించిన నర్సింగ్ సిబ్బంది



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12 (విజన్ ఆంధ్ర )మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి బదిలీపై వచ్చిన నర్సింగ్ సిబ్బంది ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగమణి ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్ వన్ గ్రేడ్ 2రేచల్, పద్మలత, పుష్పలత, సంజీత, పుష్ప, నిర్మల, అరుణ, లక్ష్మీకాంతం, అనుపమతో పాటు పలువురు నర్సింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రైతులకు అన్యాయం చేస్తున్న మంత్రి వివేక్, ఎంపీ వంశీ

**బ్రౌన్ ఫీల్డ్ ను గ్రీన్ ఫీల్డ్ గా మార్చిన చరిత్ర మీదే**
**బీజేపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్ రావు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,(విజన్ ఆంధ్ర)2018 లో ఇచ్చిన అలైన్మెంట్ రోడ్డు కాకుండా 2023 లో ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ లో వచ్చిన అలైన్మెంట్ రోడ్డు ప్రజలందరికీ యోగ్యమేనని,అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వంపై కూడా ఆర్థిక భారము తగ్గి భూసేకరణ ఏమాత్రం లేకుండా నిర్మాణము జరిగేదని కాని కేవలం కమిషన్ల కోసమే బ్రౌన్ ఫీల్డ్ రోడ్డును గ్రీన్ ఫీల్డ్ రోడ్డుగా మార్చారని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బుస్స నరసింహ రాములు, అధికార ప్రతినిధి తుల మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. జాతీయ రహదారి భాదితులకు అన్యాయం జరుగుతుంటే కనీసం మంత్రి వివేక్ వెంకటస్వామి, అయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించడం శోచనియమన్నారు. ఈ దేశంలో జాతీయ రహదారులు వేగంగా అభివృద్ధి చెందిన సందర్భం లో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆర్మూర్ నుంచి మంచిర్యాల, కేతనపల్లి వరకు నేషనల్ హైవే 63 రహదారి అభివృద్ధి



కోసం నిధులు విడుదల చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని, నరేంద్ర మోడీ, నితిన్ గడ్కరి కి ధన్యవాదాలు తెలియజేశారు. అటువంటి రోడ్డుని ప్రస్తుత రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి దురుద్దేశపూర్వకంగా తనకున్న పలుకుబడితో బ్రౌన్ ఫీల్డ్ రోడ్డును మార్చి, గ్రీన్ ఫీల్డ్ గా చేయించడం వల్ల పెద్ద ఎత్తున రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. నష్టపోతున్న రైతులు ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపుబాధిత రైతులుగా ఉన్నారని,ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా కేవలం తన స్వార్ధ రాజకీయాల కోసం, తన సొంత ప్రయోజనాల కోసం రైతుల జీవితాలను పణంగా పెట్టి వివేక్ వెంకటస్వామి బ్రౌన్ ఫీల్డ్ అలైన్మెంట్ ను మార్చడం క్షమించరాని నేరమని ఆరోపించారు.రైతులను మోసం చేసిన చరిత్ర మీదే అని ఆరోపించారు. ఈ విషయాలపై స్థానిక రైతులతో కలిసి నేషనల్ హైవే అధికారులను, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సహకారంతో ఢిల్లీలో కలవగా, అధికారులు స్థానిక పార్లమెంట్ సభ్యులు మరియు శాసనసభ్యుల యొక్క అనుమతి ఉత్తర్వులు తీసుకువస్తే మేము పాత బ్రౌన్ ఫీల్డ్ అలైన్మెంట్ కి రోడ్డు నిర్మిస్తామని వారు చెప్పారని,ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సానుకూలంగా స్పందించినప్పటికీ, పార్లమెంట్ సభ్యులైన వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీ ఏమాత్రం కూడా స్పందించకపోవడం ఆయనకు రైతులపై ఉన్న ప్రేమ ఎటువంటిదో అర్థమవుతుందన్నారు. ఎంపీ తన రికమండేషన్ లెటర్ రైతుల కోసం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. . రేపు మంచిర్యాలకు వస్తున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కూడా ఈ విషయంపై చర్చించి రైతులకు అండగా నిలబడి రైతుల సంక్షేమం కోరే కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకునే మీరు వెంటనే గ్రీన్ఫీల్డ్ మార్చి బ్రౌన్ ఫీల్డ్ గా రోడ్డు నిర్మాణం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొలిశెట్టి తిరుపతి దాస్య నాయక్, లగిశెట్టి కమలాకర్, కర్రె లచ్చన్న, గోల సత్యనారాయణ, బ్రహ్మం, బాధిత రైతులు చల్ల వెంకటేష్, తోట లక్ష్మన్న, తోట సత్యం, మీసా కొమరయ్య, శ్రీధర్, కొండవీటి శంకర్, గందె శ్రీనివాస్ తదితర బిజెపి నాయకులు బాధిత రైతులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

**పారిశ్రామిక ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి**
**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 12, (విజన్ ఆంధ్రబాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం నేపథ్యంలో శు క్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసు యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. 14 ఏళ్లలోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యాజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యాజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యాచరణ ప్రకారం స్పెషల్ డ్రైవ్ బృందాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సంవత్సరము బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించే క్యాంపెయిన్ అంశం న్యాయమైన బాల్యం బాలలకు, గౌరవప్రదమైన ఉపాధి పెద్దలకు అనేది దృష్టిలో ఉంచుకొని ఏ రంగంలో కూడా బాల కార్మికులు ఉండకూడదని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో బాల కార్మిక రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్, బాలల సంక్షేమ సమితి సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ కరుణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక,చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఓఆర్ డబ్ల్యు విజయ్ కుమార్, సీత తదితరులు పాల్గొన్నారు. గురుకుల విద్యార్థిని అభినందించిన కలెక్టర్సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (గొలిదొడ్డి)లో ఇంటర్మీడియట్ విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యి ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ లో ఐఐటీ లో సీట్ సాధించిన పెరుమాండ్ల మనస్విత్ ను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కలెక్టరేట్ లో అభినందించారు, జిల్లా బాలల పరిరక్షణ రక్షణ విభాగంలో ఔట్ రీచ్ వర్కర్ గా పని చేస్తున్న విజయ్ కుమార్ కుమారుడు మనస్విత్ సాధించిన ప్రగతిని పలువురు అభినందించారు.

# రుణాలు అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలి

**– జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**
**– పేట జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకం విడుదల**

నారాయణపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) రైతులు, విద్యార్థులు, ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరు లో బ్యాంకులు( బ్యాంకర్లు) చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇక్కడి వీసీ హాల్ లో డీ సీ సీ ( డిస్టిక్ కన్సల్టేటివ్ కమిటీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం లో బ్యాంకుల ద్వారా చేపట్టిన రుణాల పురోగతిపై కలెక్టర్ సమావేశంలో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, ఎం.ఎస్. ఎం.ఈ, విద్య, స్వయం సహాయక సంఘాల, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు పై కేటగిరి వారీగా సమీక్ష జరిపారు. రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు , స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆమె సూచించారు. జిల్లాలోని కొన్ని బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని, అలాంటి బ్యాంకులు వెంటనే తమ పనితీరును మెరుగుపరచుకొని లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకులు అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించి




వ్యవసాయం, స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు తదితర రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని ఆమె కోరారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ముద్ర యోజన తదితర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులోపు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. చివరగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4524.78 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్ డి ఓ శ్రీకాంత్, ఎస్ బి ఐ ఏ జీ ఎం పవన్ కుమార్, నాబార్డ్ డి డి ఎం మహేందర్, శీలా, కెనరా బ్యాంక్ నుంచి నరేష్, యూ బి ఐ నుంచి రమేష్ బాబు, డిఆర్డిఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్, హార్టికల్చర్ అధికారి సాయిబాబ, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల, జూన్ 12 ( విజన్ ఆంధ్ర) రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి ఆధార్ కార్డుతో డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. డీలర్ లాగిన్ అయిన అనంతరం రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగా, రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, అవసరమైన ఎరువుల వివరాలు స్క్రీన్‌పై ప్రదర్శితమవుతాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువుల కోసం డీలర్ల వద్దకు వెళ్లే ముందు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ఇంచార్జ్‌ను సంప్రదించి, ఈ-క్రాప్‌లో నమోదైన పంట వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ పంట మార్పిడి జరిగి ఉంటే, సంబంధిత వివరాలను సవరించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఇతర మండలాలు లేదా ఇతర ప్రాంతాల్లోని డీలర్ల వద్ద ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగానే ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ద్వారా సంబంధిత డీలర్ల పేర్లను తమ ఖాతాలో జోడించుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.

# రామన్నగూడెం లో 92 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంపులు సీజ్

## అక్రమ ఇసుక నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**– తహసిల్దార్ సిహెచ్ నరేష్**

నెల్లికుదురు. జూన్ 12 విజన్ ఆంధ్ర:అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసిల్దార్ సిహెచ్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నెల్లికుదురు మండలంలోని రామన్నగూడెం గ్రామంలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నాయనే నమ్మదగిన సమాచారం అందిన వెంటనే దీనిపై తక్షణమే స్పందించి. ఆర్ ఐ రామకృష్ణ, ఎస్సై చిర్ర రమేష్ బాబు తో కలిసి గురువారం సంయుక్తంగా ఒక నిఘా బృందంగా ఏర్పడి రామన్నగూడెం గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టామనిస్థానిక గ్రామ పెద్దలు మరియు పంచుల (అధికారిక సాక్షులు) సమక్షంలో గ్రామంలోని ఆకుతోట సంతోష్ 12 ట్రిప్పులు, రఘు 42 ట్రిప్పులు, సంతోష్ 12 ట్రిప్పులు, ముత్తయ్య 20 ట్రిప్పులు సంబంధిత స్థలంలో వేర్వేరు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన మొత్తం 92 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను మేము గుర్తించి, అక్కడికక్కడే పంచనామా నిర్వహించి సీజ్ చేశామని,ఈ సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పరంగా బహిరంగ వేలం వేసి ప్రభుత్వ ఆదాయానికి జమ చేయడానికి వీలుగా



అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతూ ఉన్నతాధికారులకు (జిల్లా కలెక్టర్ గారికి) నివేదిక పంపామని అన్నారు. మండలంలో ఇలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలు మరియు రవాణాపై మా నిఘా ఇలాగే నిరంతరం కొనసాగుతుంది. నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే ఎంతటి వారైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, మైనింగ్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగురాలిని ఇంటికి చేర్చిన సఖీ బృందం

**సఖీ బృందానికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

నరసరావుపేట, జూన్ 12 (విజన్ ఆంధ్ర) నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుండి మతి స్థిమితం లేని మహిళను షెల్టర్ నిమిత్తం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ- సఖి వన్ స్టాప్ సెంటర్ (ఓ ఎస్ సి) కు గురువారం తీసుకురాగా ఓఎస్‌సి ప్రతినిధులు ఆమె ను విచారించగా, తన ఊరు కోటప్పకొండ, యలమంద అని చెప్పడంతొ ఆమెను సఖి బృందం అక్కడకి తీసుకొని వెళ్లగా, అక్కడ కాదు అని కాళికా మాత గుడి అనీ ఆమె చెప్పడం జరిగింది అని బృందం సభ్యులు తెలిపారు. అలా చెప్పగా బృందం సభ్యులు అక్కడకి వెళ్లిన తరవాత తను నేను వెళ్ళిపోతాను అనీ, మీరు నాతో రావొద్దు అని ఆమె కోరడం జరిగిందని వారు తెలిపారు. దీంతో ఓ ఎస్ సి సభ్యులు ఆమె వెనకనే వెళ్లగా, మతిస్థిమితం లేని ఆ మహిళ నేరుగా ఓ ఇంట్లో ప్రవేశించడం గమనించి అది ఆమె ఇల్లే అని నిర్ధారించుకొని ఇంట్లోకి వెళ్లడం జరిగింది అని (ఓ ఎస్ సి) సభ్యులు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు చిన్నతనం లో చనిపోయారు. అనీ వాళ్ళ నాయనమ్మ తో నే ఉంటుంది అనీ ఆమెకు అప్పగించడం జరిగినది బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఏ. రాజ్యలక్ష్మి, కేస్ వర్కర్ గరికపాటి. నవీన, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ కడియాల రవికుమార్, సెంటర్ డ్రైవర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలి

**తపస్ పేటజిల్లా అధ్యక్షులు నరసింహ**

నారాయణపేట జూన్ 12 ( విజన్ ఆంధ్ర), ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు నిబంధనలకు అనుగుణంగా 2025 1,సెప్టెంబర్ లో సుప్రీం కోర్ట్ తీర్పు వెలువడిందని దీంతో ఆందోళన చెందిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ప్రత్యేక ఆర్డినేన్స్ ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినాయింపు కల్పించాలని నారాయణపేట తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహా రవీందర్ డిమాండ్ చేశారు. నిబంధనల ఆధారంగా సుప్రీం కోర్ట్2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్ కు చివరి అవకాశంగా తీర్పు ఇచ్చిందన్నారు. దీన్ని ప్రకారం టెట్ అర్హత సాధించని యెడల ఉద్యోగం నుండి తొలగించే ప్రమాదం ఉందని వాపోయారు. తెలంగాణలో 30000 మంది ఉపాధ్యాయులకు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహణ చేస్తామనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కాస్త ఊరట మాత్రమేనని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావన



జరిగినట్లు తెలిపారు. ఏప్రిల్ 1,2010 పూర్వం న్యాయ బద్దంగా నోటిఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యాయులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగింది . తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ లో టెట్ అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయన్నారు. గత 30 సంవత్సరాలనుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయం లో బోధిస్తున్నారు. టెట్ లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతున్నట్లు తెలిపారు. భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్ట్ ఉపాధ్యాయులు కూడా తమ బోధన కు సంబంధం లేని సబ్జెక్టు చదివి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంది. పైగా ఎన్ సి ఈ ఆర్ టి, ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో, దీక్ష నిష్ఠలాంటి అనేక ఆన్లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారు. తద్వారా సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నేర్చుకుంటున్నారు. ఇది అసంబద్ధ నిర్ణయంగా తపస్ అనేక మార్లు ప్రభుత్వాలకు నివేదించింది . కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినేన్స్ తెచ్చి ఏప్రిల్ 1,2010 కన్న ముందు వేసిన నోటిఫికేషన్ ద్వారా నియామాలు అయినా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు కోరుతున్నట్లు తెలిపారు.

# రైతులకు అందుబాటులో కే6 రకం వేరుశనగ -ఏవో సురేష్ బాబు

తుగ్గలి: జూన్ 12 ( విజన్ ఆంధ్ర) మండల పరిధిలోని అన్ని రైతు సేవ కేంద్రాల యందు సబ్సిడీతో కూడిన కే6 రకం వేరుశనగ అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు. శుక్రవారం రోజున ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగు చేయాలన్న రైతులు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రాల యందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఒక క్వింటం వేరుశనగ ధర 10,200 కాగా,40 శాతం సబ్సిడీ 4080 రూపాయలు పోగా రైతు వాటా క్వింటానికి 6120 రూపాయలు చెప్పున చెల్లించాలని ఆయన తెలియజేశారు. వేరుశనగ కావలసిన రైతులు పొలం పాస్ పుస్తకం,ఆధార్ కార్డు,ఆధార్ కార్డు లింక్ ఫోన్ నెంబర్ను తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నాచురల్ ఫామింగ్ ద్వారా మండల కేంద్రమైన తుగ్గలి నందు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సీడ్ బాల్స్ ను తయారుచేసి వాటిని పొలం యందు వ్యవసాయ అధికారులు వెదజల్లారు.

# ఇజ్రాయెల్ దేశంలోని ఆరోగ్య సంస్థల్లో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**- జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. ప్రశాంతి**

గద్వాల జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలోని ఆరోగ్య సంస్థల్లో స్టాఫ్ నర్స్ (హోమ్ బేస్డ్ కేర్ గివర్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలు ఇజ్రాయెల్‌లో ఉండగా మహిళలకు 90% పురుషులకు 10 % అవకాశాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 25 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు.ఏఎన్ఎం, డిఎన్ఎం,ఎంపిఎచ్ బ్ల్యూ , డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ లేదా బి.ఎస్సి నర్సింగ్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల భాషా పరిజ్ఞానం కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు లేదా ఇతర ఆరోగ్య సంస్థల్లో నర్సింగ్ సేవల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు 5,880.02 ఎన్ఐఎస్ వేతనం లభిస్తుందని, ఇది సుమారు 2,000 అమెరికన్ డాలర్లు లేదా రూ.1.93 లక్షలకు సమానమని పేర్కొన్నారు. ఉద్యోగ ఒప్పంద కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని, నివాసం, వైద్య బీమా తదితర సదుపాయాలు ఇజ్రాయెల్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్పించబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా (సివి)ను tomcomglobal@gmail.com కు పంపాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9440052081, 9440051763, 9440052592, 9440049645 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

# అధిక జ్యేష్ఠ మాసం చివరి శుక్రవారం..

**- కల్వకుర్తి వాసవి మాత ఆలయంలో భక్తి వెల్లువ**

**- 103 రకాల నైవేద్యాలతో విశేష పూజలు**



కల్వకుర్తి జూన్ 12 (విజన్ ఆంధ్ర) : అధిక జ్యేష్ఠ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆధ్యాత్మిక వైభవం నెలకొంది. హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన అధిక మాసంలో చేసే పూజలు, దానాలు, వ్రతాలకు విశేష ప్రాధాన్యత ఉండటంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా అధిక వాయనం సమర్పించి అమ్మవారి అనుగ్రహం కోరారు. అనంతరం మహిళలందరూ కలిసి 103 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అమ్మవారి పారాయణం, అర్చనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, సంతాన శ్రేయస్సు కలగాలని మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన లక్కీ డిప్‌లో ఎంపికైన పూరి లావణ్యకు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు చేతుల మీదుగా అమ్మవారి చీరను బహూకరించారు. ఈ సందర్భంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు మౌనిక, ఆకుతోటి రాణి, వాస రమాదేవి తదితరులు సమన్వయం చేశారు. కార్యక్రమంలో వాసవి మాత భక్తులు, ఆర్యవైశ్య మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అధిక జ్యేష్ఠ మాసం చివరి శుక్రవారం నిర్వహించిన ఈ విశేష పూజలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.

# జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్లు



కడప,జూన్ 12 (విజన్ ఆంధ్ర) క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించిన అసిస్టెంట్ కాలెక్టర్ల బృందం.అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా జిల్లా కలెక్టర్ వినూత్న అవిష్కరణతో అమలులోకి వచ్చిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని పరిశీలించారు.మధ్యాహ్నం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దంపతులు వారితో కలిసి మధ్యాహ్న విందును చేసి చక్కటి ఆతిధ్యం అందించారు.శిక్షణలో భాగంగా.పరిపాలన సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ నుండి పలు సూచనలు, సలహాలను స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్లు కడప జిల్లా చారిత్రక వైభవానికి ఫిదా అయ్యామని ఇక్కడి పర్యాటక వనరులు, ఇక్కడి ప్రజల స్వభావం, జీవనశైలి మమకారం మేళవించినట్లుందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్లకు చిరు కానుకను అందజేసి సత్కరించారు. కాగా చక్కటి ఆతిధ్యం అందించిన జిల్లా కలెక్టర్ దంపతులకు వారు ధన్యవాదాలుతెలియజేసారు. సాయంత్రం జిల్లాలోని చారిత్రక, పురాతన శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం.జిల్లాలో పర్యటనను ముగించుకుని వెళ్లారు.క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్లు.సిహెచ్. శ్రవణ్ కుమార్ రెడ్డి, (ఏలూరు),హరిఓం పాండ్య (శ్రీకాకుళం),జిల్లా ఆదిత్య శర్మ (తూర్పుగోదావరి), నమ్రత్ అగర్వాల్ (కృష్ణా), పవన్ తేజ ఏఆర్ (ఎస్పీఎస్ నెల్లూరు),ప్రియా (కాకినాడ), సుయాస్ కుమార్ (అనంతపురం), వెంకటేష్ బన్న (చిత్తూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వారివెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు

# పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం


**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12,( విజన్ ఆంధ్ర) పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణకు నూతన నియమాలను అమలు చేస్తోందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు ఆఫీస్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 'స్వచ్ఛ తెలంగాణ' ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే వర్మి కంపోస్టు బెడ్స్ (వానపాముల ఎరువు తయారీ షెడ్డు)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుధ్యం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటి నుండి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక జాగ్రత్త చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి పచ్చ, నీలం, ఎరుపు, నలుపు రంగుల బుట్టల్లో సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఇళ్ల నుండి సేకరించిన తడి చెత్తను గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వర్మి కంపోస్టు బెడ్స్‌కు తరలించి, నాణ్యమైన సేంద్రీయ ఎరువును తయారు చేస్తామని తెలిపారు. ఈ ఎరువు వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను లేదా చెత్తను తగలబెట్టడం, మురుగు కాలువలు, చెరువులు తదితర జలవనరుల్లో వ్యర్థాలను పడేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలు, మట్టి, ఇటుకలను రోడ్లపై పోసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, మార్కెట్లు, బస్టాండ్ల నిర్వాహకులు తమ పరిసరాల్లో తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్, సీసీలు కార్తీక్, యాసిన్, స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామకాలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాం

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12 , (విజన్ ఆంధ్ర) ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రీ-ప్రైమరీ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూలు) నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తూ, అభ్యర్థుల నైపుణ్యాలు, అర్హతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే పిల్లలకు నాణ్యమైన పునాది విద్య అందించడంలో ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధనా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలలో అభ్యర్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పిల్లలను ఆకట్టుకునే బోధనా పద్ధతులు, వారి వ్యక్తిత్వం, సేవా దృక్పథం వంటి అంశాలను ప్రధానంగా పరిశీలించినట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ ఆఫీసుల్లో సదుపాయాల కరువు..!!

- మహిళా సాధికారత మాటల్లోనేనా..?
- డిజిటల్ ఇండియాలో దేశాన్ని నడిపే మహిళలకు, ఉద్యోగులకు 'టాయిలెట్లే' లేవా..?!
- గౌరవప్రదమైన ఉద్యోగం.. నరకప్రాయమైన 'ఆఫీస్' జీవితం..!
- నిధులు ఎటు పోతున్నాయి? కనీస వసతులపై పట్టింపేది..?

*డిజిటల్ ఇండియా, సమాన హక్కులు అని మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో కూడా, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడం లేదా ఉన్నా అవి వాడకానికి వీల్లేకుండా శిథిలావస్థకు చేరడం అత్యంత విచారకరం. ఇది ప్రభుత్వ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న అత్యంత ప్రాథమిక, ఆవేదనాభరితమైన సమస్యకు అద్దం పడుతోంది.*






కాటారం డివిజన్, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మహాదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మలహర్ మండలాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు టాయిలెట్ల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించే మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, ఉన్నచోట్ల పరిశుభ్రత లేకపోవడం, నీటి వసతి లేకపోవడం వల్ల నిత్యకృత్యాల నిర్వహణ సవాలుగా మారి మహిళలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
మహిళలతో పాటు పురుష ఉద్యోగులు కూడా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు నెలసరి సమయంలో మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కార్యాలయాల్లో గంటల తరబడి విధులు నిర్వహించాల్సిన పరిస్థితుల్లో సరైన టాయిలెట్ సదుపాయం లేకపోవడం శారీరక, మానసిక సమస్యలకు దారితీస్తోంది. తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేక పలువురు మహిళలు మానసిక ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని కార్యాలయాల్లో టాయిలెట్లు ఉన్నప్పటికీ అవి పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీరు , నీటి సరఫరా లేకపోవడం వల్ల ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. దీంతో మహిళలు సమీపంలోని ఇతర కార్యాలయాల టాయిలెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే అక్కడి సిబ్బంది సహకరించకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంతో కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మహిళలు.. ఆఫీసుల్లో ఈ కనీస వసతి లేక నిత్యం నరకం అనుభవిస్తున్నారు.
ఉదయం నుండి సాయంత్రం వరకు టాయిలెట్ కి వెళ్లకుండా ఉండటం కోసం చాలా మంది మహిళా ఉద్యోగులు ఆఫీస్ అవర్స్‌లో మంచినీరు తాగడం పూర్తిగా మానేస్తున్నారు. దీనివల్ల కిడ్నీలో రాళ్లు రావడం, యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు, తీవ్రమైన డీహైడ్రేషన్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. వేసవి కాలంలో ఎక్కువగా నీరు తాగాల్సిన పరిస్థితి ఉండటంతో తరచూ మరుగుదొడ్ల అవసరం ఏర్పడుతోంది. టాయిలెట్లు లేకపోవడంతో కొందరు పురుష ఉద్యోగులు రహదారుల పక్కన లేదా చెట్ల మధ్య మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో నిత్యకృత్యాలు నిర్వహించడం మహిళలు, పురుషులు ఇద్దరికీ ఇబ్బందికరంగానే కాక ఆరోగ్యపరమైన ప్రమాదాలకు కూడా కారణమవుతోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా పరిశుభ్రమైన టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు. మహిళా అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులు కూడా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ.. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మహిళల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక "మహిళా టాయిలెట్లు" నిర్మించాలి. కేవలం కట్టడమే కాకుండా.. వాటి నిర్వహణకు ప్రత్యేక నిధులు, సిబ్బందిని కేటాయించి, నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించని పక్షంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులను బాధ్యులను చేస్తూ కఠిన నిబంధనలు తీసుకురావాలి. "మహిళా సాధికారత" అనేది కేవలం మాటల్లో కాదు.. వారు పని చేసే చోట గౌరవప్రదమైన వాతావరణం, కనీస సదుపాయాలు కల్పించినప్పుడే అది సాధ్యమవుతుంది..!

# సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ప్రజా ఉద్యమంలా కొనసాగాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఒక ప్రజా ఉద్యమంలా కొనసాగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదిలాబాద్ పట్టణ కౌన్సిలర్లు, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బీంపూర్, బేల, తాంసి, తలమడుగు మండలాల సర్పంచ్‌లతో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ సీసీటీవీ కెమెరాల అవసరం, వాటి ద్వారా సమాజానికి కలిగే ప్రయోజనాలపై ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణలోనే కాకుండా, నేరాల ఛేదన, దర్యాప్తు, నిందితుల గుర్తింపులో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. జిల్లాలో గతంలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఛేదించిన పలు నేరాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. నేరం చేసిన వారు ఎవరు అనేది నిర్ధారించడంలో, నేరం చేసిన పద్ధతి, నేరస్తులను కనుగొనే విధానం, మరో నేరం చేయకుండా అడ్డుకునే స్థితి సీసీటీవీ కెమెరాల వల్ల సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి ప్రధాన కూడలిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు ముందుండి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని సరైన చికిత్స ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని, అలాంటి వారి సమాచారం పోలీసులకు అందిస్తే డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లో గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాప్రతినిధులను కోరారు.సదస్సులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తమ గ్రామాలలో, వార్డుల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, బి.డి. ప్రేమ్ కుమార్, జి. శ్రావణ్, రహీం పాషా, స్థానిక కౌన్సిలర్లు, మండలాల సర్పంచ్‌లు, ఆర్ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ ఉల్లంఘనపై కలెక్టర్ కఠిన చర్యలు

**- విధులకు గైర్హాజరు, 8 మంది అంగన్‌వాడీ సిబ్బంది సేవల రద్దు,**

**- విధులకు హాజరుకాని మూడు ప్రాజెక్టుల్లో 8 మంది అంగన్‌వాడీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



కొల్లాపూర్ జూన్ 12 : (విజన్ ఆంధ్ర) : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో క్రమశిక్షణను పటిష్టపరచడంతో పాటు సేవల నాణ్యతను మెరుగుపరచే దిశగా జిల్లా పరిపాలన కీలక చర్యలు, ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.14 నిబంధనల మేరకు, దీర్ఘకాలంగా విధులకు హాజరు కాకుండా ఉన్న 8 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి అనుమతి లేకుండా నెలల తరబడి, కొందరు సంవత్సరాల పాటు విధులకు గైర్హాజరవుతూ కేంద్రాల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖ అధికారుల నివేదికలు, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు చేపట్టి వారి సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆరోగ్య సేవలు అందించే కీలక వ్యవస్థగా ఉన్నందున సిబ్బంది నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు.కొల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది 2023 ఫిబ్రవరి నుంచి 2026 జనవరి వరకు వివిధ కాలాల్లో విధులకు గైర్హాజరవుతున్నట్లు రికార్డులు వెల్లడించినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం వారి తొలగింపునకు ప్రతిపాదనలు సమర్పించగా, వాటికి ఆమోదం లభించినట్లు చెప్పారు. తొలగింపునకు గురైన వారిలో కొల్లాపూర్ ప్రాజెక్టుకు చెందిన సి. పద్మావతి, నిరంజన్‌బెల్ల, కాశమ్మ, దర్జి బక్కమ్మ, ఉన్నారు.జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, అనధికార గైర్హాజరు లేదా విధుల పట్ల నిర్లక్ష్యానికి పాల్పడిన వారిపై భవిష్యత్తులో కూడా ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా క్రమశిక్షణా ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# దివ్యాంగుల కోసం ప్రజావాణి లో ప్రత్యేక ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 12 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సేవలు, వివిధ సంక్షేమ పథకాల అమలులో దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సాధారణ ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగుల ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తున్నప్పటికీ, వారి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాల్సిన అవసరం ఉందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మధ్యాహ్నం 12:30 గంటల నుండి 1:30 గంటల వరకు కలెక్టరేట్ ఐడీఓసీ హాల్‌లో ఈ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించ బడుతుంది. సంబంధిత శాఖల అధికారులు హాజరై దివ్యాంగుల సమస్యలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారని తెలిపారు. అందువల్ల జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ మంజూరు

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



గద్వాల జూన్ 12 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : 2026-28 కి సంబంధించిన జర్నలిస్టుల ఆక్రెడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, రవీందర్ రెడ్డి, నల్లన్న, వెంకటేష్, సిరాజ్, భీమ రాయుడు, జాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో భారీ బొగ్గు స్కాం!!

- 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఫేక్
- బొగ్గు లేదు..? అంతా కాగితాలపై మాయాజాలమే..?
- లేని బొగ్గుకు రాయల్టీ ఎలా చెల్లిస్తున్నారు
- సీబీఐ విచారణ జరపాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 12 (విజన్ ఆంధ్ర): సింగరేణిలో భారీ బొగ్గు కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఓపెన్ కాస్ట్ 5 గనిలో బొగ్గు నిల్వలు పరిశీలించిన కొప్పుల మాట్లాడుతూ, సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఆర్జీవన్ పరిధిలో 6లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని యాజమాన్యం చెబుతుండగా, వాస్తవానికి ఓపెన్ కాస్ట్ 5 లో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు కూడా లేవని, ఇదే పరిస్థితి దాదాపు అన్ని సింగరేణి ఏరియాలలో ఉంది అని తీవ్రంగా విమర్శించారు. ఇదే లేని బొగ్గును కాగితాలపై ఎలా సృష్టించారో, దానికి సంబంధించిన రాయల్టీలు ఎలా చెల్లించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర సీబీఐ విచారణ జరిపితే అసలు నిజాలు బయటపడతాయని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను నట్టేట ముంచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఓబీ కాంట్రాక్టులు, సోలార్ ప్లాంట్లు, డిటోనేటర్ కొనుగోళ్లు, బొగ్గు ఆధారిత విద్యుత్ సంస్థలకు సంబంధించిన లావాదేవీలు సహా అనేక రంగాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా సంపదను కొందరి ప్రయోజనాల కోసం దోచుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో సింగరేణి కార్మికుల జీవితాలతో పాటు ఈ ప్రాంత ఆర్థిక అభివృద్ధితోనూ ఆటలాడుతున్నారని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంట టిబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తదితరులు పాల్గొని సింగరేణిలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

# మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది

- ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్ జూన్ 12 (విజన్ ఆంధ్ర) : భారతదేశానికి అత్యధిక కాలం పాటు ప్రధానిగా సేవలందించిన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ 4,399 రోజుల పాలనతో చరిత్ర సృష్టించారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా



సమావేశంలో ఆమె మాట్లాడారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రజల తరపున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రజలు మోదీ నాయకత్వంపై విశ్వాసంతో కాషాయ జెండాను ఎగురవేస్తున్నారని ఆమె అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. ప్రధానికి మరింత శక్తి, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. గత 12 ఏళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఒకప్పుడు ప్రపంచంలో 10వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ప్రస్తుతం జపాన్‌ను వెనక్కి నెట్టి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్



కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారని, జనధన్ యోజన ద్వారా 58.2 కోట్ల మందికి జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవడం జరిగిందని తెలిపారు. ఇందులో 32 కోట్ల మంది మహిళల ఖాతాలు ఉన్నాయని చెప్పారు. జీఎస్టీ అమలు ద్వారా పారదర్శకమైన పన్ను వ్యవస్థ ఏర్పడిందని, ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఉజ్వల యోజన ద్వారా 11 కోట్ల పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. పీఎం స్వనిధి, ముద్ర రుణాలు, సుకన్య సమృద్ధి యోజనల ద్వారా మహిళలు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని అన్నారు. కోవిడ్ కాలం నుంచి ఇప్పటివరకు 81 కోట్ల మందికి ప్రధానమంత్రి గరీబ్ అన్న యోజన ద్వారా ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తున్నామని తెలిపారు. పీఎం అవాస్ యోజన ద్వారా 4 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. రైతుల కోసం పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి రూ.6 వేల చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.4.3 లక్షల కోట్లకు పైగా అందజేశామని పేర్కొన్నారు. ఎరువులపై 90 శాతం సబ్సిడీ అందిస్తూ రైతులకు భారీ ఊరట కల్పిస్తున్నామని తెలిపారు. ఈ-నామ్ యాప్ ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు. పీఎం సూర్యఘర్ యోజన ద్వారా పేదల ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై అధికారులు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే దేశంలో ఎయిమ్స్ ఆసుపత్రుల సంఖ్యను 4 నుంచి 23కు పెంచి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. దేశంలో రోడ్లు, మెట్రో సేవలు, రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం 26 నగరాల్లో మెట్రో సేవలు విస్తరించగా, 164 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారులు, రింగ్ రోడ్లు, బైపాస్ రోడ్లు, గ్రామీణ సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతో రోడ్ల అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. గుడేబల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లైన్ల రహదారికి ఆమోదం లభించిందని తెలిపారు. కేంద్ర భాగస్వామ్య పథకాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అచ్చుగట్ల అంజయ్య, పడకుల బాలరాజు, కిరణ్ కుమార్ రెడ్డి, జ్యోతి, కృష్ణవర్ధన్ రెడ్డి, పడకుల సత్యం, సుబ్రమణ్యం, యాదయ్య, యాదగిరి, కరుణాకర్, పద్మమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ స్కూల్ ను సందర్శించిన కలెక్టర్

- విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు ఆదేశం



నిజామాబాద్, జూన్ 12 : (విజన్ ఆంధ్ర )మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శు క్రవారం సందర్శించారు. స్కూల్ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ స్కూల్ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ



అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కాగా, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే సఖీ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నిజామాబాద్, జూన్ 12 :( విజన్ ఆంధ్ర ) రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి



పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్న ఆక్రమణలను సంబంధిత శాఖలు సమన్వయంతో తొలగించాలని సూచించారు. పీ.ఎం రహ్ వీర్, పీ.ఎం రాహత్ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఆర్ అండ్ బీ ఈ.ఈ అజ్మీర, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎన్.ఐ.సీ అధికారి మధు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, ఈ-దార్ మేనేజర్ హర్ష, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

- ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ : 1800 233 2447

కడప,జూన్ 12 (విజన్ ఆంధ్ర): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలో ప్రజలు చురుకుగా సహకరించాలని. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు.బాల కార్మికులపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1800 233 2447 కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. గృహ సేవలు, నిర్మాణ రంగం, చిన్న పరిశ్రమలు,వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల్లో పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు.బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారి రక్షణకు సహకరించాలని కోరారు. బాల కార్మికులను నియమించడాన్ని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) సవరణ చట్టం1994ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం బాలలను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్న డాక్టర్ నాగరాజు, చిన్నారుల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా సమాజం ఏకతాటిపైకి వచ్చి చిన్నారులకు విద్యాభ్యాసం, సంరక్షణ మరియు సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బాల్యం చదువుకోవడానికి, ఎదగడానికి.పనులు చేయడానికి కాదు బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలి"అని డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు.

# మాదకద్రవ్య నిర్మూలనకు ప్రజలు భాగస్వాములు కావాలి

- డ్రగ్స్ మన భారతదేశ సంస్కృతి కాదు
- బి ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

కొత్తకోట జూన్ 12 (విజన్ ఆంధ్ర): కొత్తకోట:ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట పట్టణంలో 2కే రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొత్తకోట చౌరస్తా వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అతిథులు, ఏటీఆర్ కన్వెన్షన్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొత్తకోట వాకర్స్ ప్రజలందరితో కలిసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక, బాల్య వివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్లను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడి ఎంతోమంది




యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత సీరియస్‌గా ఉన్నారని, ఈగల్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్‌ను అరికట్టడం ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అధికారులకు అందించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచబడుతుందని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చివరి రోజున డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై పర్యవేక్షణ ఉంచి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వనపర్తి జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువత తెలియకుండానే డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సేవించేవారు, లేదా సరఫరా చేసేవారికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా సంస్థలు, గ్రామాలు, కాలనీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలంగాణ మోడల్ స్కూల్ లో చదివిన విద్యార్థినికి ఇంటర్మీడియట్లో అత్యుత్తమ మార్కులు వచ్చిన విద్యార్థినికి ముఖ్య అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పల్లవి, కృష్ణారెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, వాకర్స్, పోలీసు శాఖ అధికారులు, కొత్తకోట వాకింగ్ అసోసియేషన్ల సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ కేటుగాళ్ల కొత్త తరహా మోసం

నిజామాబాద్ జూన్12:( విజన్ ఆంధ్ర ) : సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన వారిని లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకు వివిధ రకాలుగా ప్రజలను నమ్మించి వారిని వలలో వేసుకొని కోట్లాది రూపాయలు దండుకున్న విషయం తెలిసిందే. అయితే వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలతో చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా 1930 టోల్ ఫ్రీ నెంబర్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీస్ చర్యలతో ఖశీగుతిన్న సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాన్ని ఎంచుకున్నారు. గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి నేరుగా ఫోన్ చేసి కేవైసీ అప్డేట్ చేసుకోవాలని నమ్మిస్తున్నారు. అయితే కేవైసీ అప్డేట్ కోసం ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని ఇంటి నుండే అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అందుకుగాను సైబర్ నెరగాళ్లు కెవిపి తో కూడిన యాప్ ను బాధితుల ఫోన్ కు పంపుతున్నారు. ఆ యాప్ ఓపెన్ చేసి మీ పూర్తి వివరాలు అందులో పొందుపరచాలని, ఆ వివరాలతో కేవైసీ అప్డేట్ అవుతుందని నమ్మిస్తున్నారు. ఇది వాస్తవమేనని గ్రహించిన కొందరు వారి వలలో చిక్కుకొని పూర్తి వివరాలు వారు పంపిన యాప్ లో పొందుపరుస్తున్నారు. ఆ తర్వాత బాధితుల ఫోన్ కు వచ్చిన ఓటిపి చెప్పగానే సైబర్ నేరగాళ్లు వారి బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును కాజేస్తున్నారు. ఈ తరహా మోసం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో చోటు చేసుకుంది. గ్యాస్ కంపెనీ నుండి ఫోన్ చేస్తున్నామని చెప్పి విజయవాడకు చెందిన ఓ మహిళకు ఫోన్ వచ్చింది. వెంటనే వారు పంపిన యాప్ లో పూర్తి వివరాలు, బ్యాంకు ఖాతా తో పాటు పొందుపరచడంతో వెంటనే సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుండి ఎనిమిదిన్నర లక్షలు (8.5) కాజేశారు. గ్యాస్ సబ్సిడీ కూడా మీకు వర్తిస్తుందని చెప్పడంతో ఇతర వివరాలతో పాటు బ్యాంకు ఖాతా నెంబర్ కూడా పంపడంతో సైబర్ నేరగాళ్లకు వారి ఖాతా నుండి డబ్బులు కాజేయడం సులువుగా మారింది. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తంగా ఉండి కొత్త తరహా సైబర్ నెరగాళ్ళ మోసాలకు బలి కావద్దని, గ్యాస్ కంపెనీ నుండి వచ్చిన ఫోన్ వాస్తవా మా కాదా అన్నది తెలుసుకోవాలని సైబర్ నియంత్రణ అధికారులు సూచిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తులకు తమ వివరాలను పంపవద్దని తెలియజేస్తున్నారు. గ్యాస్ కేవైసీ అప్డేట్ కోసం ఆఫీస్ కు వెళ్లాలని, లేదంటే గ్యాస్ సప్లై చేసే బాయి మీ ఇంటికి వచ్చి అప్డేట్ చేస్తారని వెల్లడిస్తున్నారు. అంతేకానీ ఫోన్ చేసినవారికి ఏలాంటి సమాచారం ఇవ్వద్దని సైబర్ నియంత్రణ అధికారులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు పెంచాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదల, మౌలిక వసతుల కల్పన, రాబోయే విద్యా సంవత్సర ప్రణాళికలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల వారీగా విద్యార్థుల ప్రవేశాలు, అందుతున్న విద్యా సేవలు, పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలకు తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. రాబోయే పరీక్షల్లో వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు. అదేవిధంగా, విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, ల్యాబ్ సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయానికి తాళం..!

- వసతుల్లేని జిల్లా గ్రంథాలయంపై పాఠకుల ఆగ్రహం
- సమస్యల పరిష్కారం కోరుతూ లైబ్రరీకి తాళం..
- అధికారులు వచ్చేదాకా తెరవబోమని హెచ్చరిక



గద్వాల జూన్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో) : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలవాల్సిన జిల్లా గ్రంథాలయం నిర్లక్ష్యానికి నిలయంగా మారిందంటూ పాఠకులు ఆందోళనకు దిగారు. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తూ శుక్రవారం గ్రంథాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్వీ నాయకుడు కుర్వపల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పలువురు నిరుద్యోగ యువకులు, పాఠకులు పాల్గొన్నారు. గ్రంథాలయంలో ఒకే గదిలో 20 మందికి పైగా అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పటికీ సరిపడా స్థలం, ఫ్యాన్లు, కుర్చీలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చదువుకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా స్పందన కరువైందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉండాల్సిన గ్రంథాలయం సమస్యలతో సతమతమవుతుండటం దురదృష్టకరమని నిరసనకారులు విమర్శించారు. వెంటనే అవసరమైన సౌకర్యాలు కల్పించి, గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు గ్రంథాలయ తాళాలు తీయబోమని పాఠకులు తేల్చిచెప్పారు. దీంతో గ్రంథాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఆరోగ్యమే పోలీస్ బలం!!

- ఫిట్‌గా ఉంటేనే విజయం
- పరేడ్‌లో సీపీ అంబర్ కిషోర్ సందేశం




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 12 (విజన్ ఆంధ్ర): రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం అర్మ్‌డ్ సిబ్బందికి వారాంత పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గౌరవ వందనం స్వీకరించి సిబ్బంది ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం మాట్లాడిన ఆయన పోలీస్ విధుల్లో శారీరక దారుఢ్యం అత్యంత కీలకమని, ప్రతి అధికారి, సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికల విధులతో పాటు నిత్య విధుల్లోనూ అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని అభినందించారు. సుమారు వంద మంది పాల్గొన్న పరేడ్ విజయవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఫిట్‌గా ఉంటేనే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలమని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం, విశ్రాంతిపై దృష్టి పెట్టాలని సూచించారు. సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, త్వరలో మెగా మెడికల్ క్యాంప్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా పోలీసుల చురుకైన భాగస్వామ్యాన్ని అభినందిస్తూ శాఖలో అందరికీ సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మహిళా పోలీసుల కోసం ప్రత్యేక ప్లాటూన్ల ఏర్పాటుపై కూడా పరిశీలన జరుగుతోందన్నారు. ఆరోగ్యకరమైన పోటీ సిబ్బంది పనితీరు మెరుగుపరుస్తుందని పేర్కొన్న కమిషనర్, పరేడ్ మొత్తం సంతృప్తికరంగా సాగిందని అభిప్రాయపడ్డారు.

## యువత క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి - మంత్రి సీతక్క.



ములుగు జూన్12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జూన్ 14 న ములుగులో జరిగే "అస్మిత సైక్లింగ్ పోటీలు" పోస్టర్‌ను మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆవిష్కరించారు. క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని మంత్రి పేర్కొన్నారు. సైక్లింగ్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ..... జిల్లాలో క్రీడా సంస్కృతి బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి జాతీయ స్థాయికి పంపడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అస్మిత సైక్లింగ్ పోటీల ద్వారా ములుగు యువతకు మంచి వేదిక లభిస్తుందని, జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్‌ను జిల్లాలో ప్రధాన క్రీడగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ప్రవీణ్ వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్ రావు పాల్గొని బాదం ప్రవీణ్‌ను అభినందించారు.

## విద్యార్థుల భద్రత, డయాలసిస్ సెంటర్‌పై మంత్రి సీతక్క ఫోకస్.



ములుగు జూన్12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా గడిగడ్డ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించి అక్కడికక్కడే శుభ్రత పనులు చేయించారు. లిమంత్రి సీతక్క మాట్లాడుతూలి "సెలవుల్లో మూసి ఉన్న హాస్టళ్లలో పాములు, తేళ్లు చేరే ప్రమాదం ఉంది. పిల్లలు వచ్చేలోపు ఒక్క ప్రమాదం కూడా జరగొద్దు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో మెగా శానిటేషన్ 100% పూర్తి కావాలి" అని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ, వార్డెన్లు, హెచ్ఎంలతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పనులు పర్యవేక్షించాలన్నారు. ఈ విధానం రాష్ట్రమంతా అమలు చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్, డయాలసిస్ యూనిట్, ఎమర్జెన్సీ వార్డులను మంత్రి పరిశీలించారు. డయాలసిస్ సెంటర్ నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క.. కిడ్నీ రోగులు ప్రతి వారం వందల కిలోమీటర్లు వెళ్తున్నారు. ఇక ఆలస్యం చేయొద్దు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి సెంటర్ ప్రారంభించాలి" అని డెడ్‌లైన్ విధించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందేలా రోజువారీ మానిటరింగ్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, కౌన్సిలర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పట్టాల పంపిణీతో భూ హక్కులు, ప్రజా దర్బార్‌తో సమస్యలకు చెక్ - మంత్రి సీతక్క.



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రామచంద్రపూర్ భూములకు పట్టాల పంపిణీ ద్వారా భావితరాలకు శాశ్వత భూ హక్కులు కల్పిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మండలంలోని గిత్తూర్ తండా, కొడిశాలకుంట, ముద్దునూర్ తదితర గ్రామాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూలి "ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకెళ్లేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నాం. భూమి, ఇండ్లు, పెన్షన్లు, సాగునీటి సమస్యలకు వేగవంతంగా పరిష్కారం చూపిస్తాం" అని హామీ ఇచ్చారు. రామచంద్రపూర్ భూములకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేసి రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# అక్షరాల వెనుక అక్రమ పుస్తక మాఫియా సిండికేట్..!!



- రహస్య 'ములాకత్'.. నిలువు దోపిడీ..!
- బడి గడప తొక్కకముందే 'ధరల' వాత..
- బంగారం ధరలతో పోటీ పడుతున్న పుస్తకాల ధరలు..
- కళ్ళున్నా చూడని విద్యాశాఖ అధికారులు..!
- విద్యాశాఖ తనిఖీలు కేవలం కాగితాలకేనా..?
- ఈ 'టెక్ట్స్‌బుక్' బ్లాక్ మార్కెట్‌కు అండెవరిది..?

"అక్షరాలు నేర్పించాల్సిన సరస్వతీ నిలయాలు, అక్రమ సంపాదనకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారుతున్నాయి. అడ్మిషన్ల ఫీజులు చాలదన్నట్టు.. ఇప్పుడు 'పుస్తకాల' పేరిట నిలువు దోపిడీ చేస్తున్నాయి. నిర్దేశిత షాపుల్లోనే కొనాలనే హుకుం.. ప్రశ్నిస్తే సీట్ల రద్దు బెదిరింపులు.. ఇష్టానుసారంగా అధిక ధరలకు అమ్మకాలు.. అప్పుల బాధతో తలబాదుకుంటున్న మధ్యతరగతి కుటుంబీకులు,"

## విద్యాశాఖ అధికారులారా ఈ మాఫియా మూలాకత్ పై జర నజరేయండి...!!






కార్పొరేట్ విద్యా సంస్థల ఇష్టానుసారం....

### కార్పొరేట్ స్కూళ్ల 'కమిషన్ల' కక్కుర్తి పై "విజన్ ఆంధ్ర" స్పెషల్ స్టోరీ..!

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 11 (విజన్ ఆంధ్ర) : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మరియు కార్పొరేట్ పాఠశాలలు నిర్దేశిత పుస్తకాలు, నోట్‌బుక్కులను పాఠశాలల్లో కాకుండా నిర్ణీత స్టేషనరీ దుకాణాల ద్వారా ఎక్కువ ధరకు అమ్మిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయనే ఆరోపణలు వెళు వెత్తుతున్నాయి. కొన్ని పాఠశాలలు అయితే సొంతంగా ముద్రించిన పుస్తకాలను మాత్రమే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ అక్రమ అమ్మకాలపై పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**విద్యా వ్యాపారం పై కమీషన్ల దందా....**

పాఠశాలల యాజమాన్యం నిర్దేశించిన నిర్దిష్ట స్టేషనరీ దుకాణాల్లోనే పుస్తకాలు కొనాలని నిబంధనలు పెడతున్నాయి. దీనివల్ల ఆ దుకాణాల యజమానులు ఇష్టమొచ్చిన ధరలకు పుస్తకాలను, నోట్ బుక్ లను విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఇదేంటి అధిక ధరలు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే స్టేషనరీ దుకాణాల యాజమాన్యం అది అంతే తాము పాఠశాలల యాజమాన్యం కు కమిషన్లు ఇవ్వాల్సి ఉంటుందనే సమాధానం చెబుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు బదులుగా ప్రైవేట్ ప్రచురణకర్తల పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌షీట్లు, స్టేషనరీ పేరుతో వేల రూపాయల భారాన్ని మోపుతున్నారు.

**రెట్టింపు ధరలు :**

సామాన్యుడికి అందుబాటులో ఉండాల్సిన విద్య, కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపారంగా మారిపోయింది. మార్కెట్లో సాధారణ నోట్‌బుక్ ధర రూ.30 లేదా రూ.40 ఉంటే, స్కూల్ లోగో ఉన్న పుస్తకాలను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇటు స్టేషనరి దుకాణాల వ్యాపారులు, అటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయానే చెప్పవచ్చు. పాఠశాల ఆవరణలో పుస్తకాలు, యూనిఫాంలు అమ్మకూడదని విద్యాశాఖ, బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఎన్సీఈఆర్టీ (ఎన్ సి ఈ ఆర్ టి ) లేదా ప్రభుత్వం సూచించిన సిలబస్‌ను ఏ పుస్తకాల దుకాణం నుంచైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ తల్లిదండ్రులకు ఉంటుందని, అది హక్కు అని గుర్తించాలి. స్కూల్ యాజమాన్యాలు నిర్దేశిత షాపుల్లోనే కొనాలని ఒత్తిడి చేస్తే, జిల్లా విద్యాశాఖ అధికారికి (డీ ఈ వో ) లేదా తెలంగాణ పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదు చేయవచ్చు. విద్యాశాఖ అధికారుల నుండి అనుమతి పొందిన, ప్రభుత్వంచే ముద్రించబడిన పుస్తకాలను మాత్రమే ఎంచుకోవాలి.

జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు వారి పాఠశాలలో మాత్రమే నోట్ బుక్స్ కొనుగోలు చేయాలని హుకుం జరిచేస్తున్నారు. దీంతో స్టేషనరి దుకాణాల యూనియన్ లు మాత్రం పాఠ్య పుస్తకాలు తాము విక్రయించమని, తమవద్దనే నోట్ బుక్స్ కొనుగోలు చేస్తేనే మిగతా పాఠ్యపుస్తకాలు విక్రాయిస్తామని సూచిస్తున్నాయి. నోట్ బుక్స్ ద్వారనే మాకు లాభాదాయకం అని చెప్పుకొస్తున్నారు.

**బలవంతం చేయడం నేరం....**

తల్లిదండ్రులు తమకు నచ్చిన చోట లేదా బహిరంగ మార్కెట్లో పుస్తకాలు కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ ఉండాలి. నిర్దిష్ట దుకాణాలకే వెళ్లాలని ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధం.

**విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు....**

పాఠశాలలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలలను తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే చెప్పాలి.. కాని విద్యాశాఖ అధికారులు మాత్రం అవేమి పట్టనున్నట్లు వ్యవహారిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరిగిపోతుంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ప్రయివేటు పాఠశాలల ఆగడాలు మితి మిరిపోయాయి

- టి వి యు వి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్



కళ్ల ముందే ఇంత పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నా, ప్రైవేట్ మేనేజ్‌మెంట్లపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్దల "అండదండలు" ఉన్నాయనే అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు మీతి మిరిపోయాయి. స్టేషనరి దుకాణలు, ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు మేలుకొని ధరలను నియంత్రణ చేయాలి. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతాం. ఈ బ్లాక్ మార్కెట్ సిండికేట్‌ను బద్దలు కొట్టాలంటే కేవలం నిబంధనలు సరిపోవు; క్షేత్రస్థాయిలో కఠినమైన తనిఖీలు, తప్పు చేసిన స్కూళ్ల గుర్తింపు రద్దు చేయడం వంటి కఠిన చర్యలు అవసరం. విద్యాశాఖ ఇకనైనా కళ్లు తెరవాలని ఆశిద్దాం.

# కారుచీకటి గనుల్లో కన్నీటి ఊట..!!

- సింగరేణి 'నల్ల సూర్యుల' కడుపు కోత..!
- రక్తంతో దేశానికి వెలుగులు.. పాలకుల నిర్లక్ష్యంతో వారసులకు చీకట్లు..!
- కార్మికుల చెమట చుక్కలతో కోట్లు.. కన్నీటి చుక్కలకు విలువేది..?

*నల్లబంగారు క్షేత్రంలో.. నలిగిపోతున్న వారసత్వ కలలపై, ఈ సుదీర్ఘ వేదనపై, ఉద్యోగం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న బాధితుల ఆక్రందనలు, బొగ్గు గనిలో బతుకు చిత్రాన్ని చదవండి...*

- ఓట్ల వేటలో సింగరేణి బాట.. తీరా గెలిచాక పాలకుల దాటవేత..!
- మారుపేర్ల వారసుల వేదనకు ముగింపు ఎప్పుడు..?

**బొగ్గు పొరల వెనుక దాగిన 'మారుపేర్ల' కన్నీటి గాథ పై "విజన్ ఆంధ్ర" అందిస్తున్న ప్రత్యేక కథనం..!**

హైదరాబాద్, జూన్ 12 :

నల్లబంగారు క్షేత్రం.. వేల కుటుంబాలకు జీవనాధారం.. తెలంగాణ ఆర్థిక ఇంజన్ అయిన సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి వేధిస్తున్న ఒక సుదీర్ఘ విషాదం 'మారుపేర్ల (డిపెండెంట్స్) సమస్య'. నాడు ఎవరో చేసిన తప్పులకు, నాటి పరిస్థితుల ప్రాణ సంకటాలకు నేడు వారి వారసులు, నమ్ముకున్న కుటుంబాలు బలైపోతున్నాయి. తరాలు మారుతున్నాయి, ప్రభుత్వాలు మారుతున్నాయి, కానీ ఆ గనుల్లో మగ్గిపోతున్న కార్మిక కుటుంబాల కన్నీళ్లు మాత్రం మారడం లేదు.




**ఆశల మునివాకిట.. ఆయువు ఆవిరవుతుంటే..!**

తమ తండ్రో, తాతో నల్లబొగ్గు గనుల్లో రక్తాన్ని చెమటగా మార్చి సంస్థను నిలబెడితే... తమకు వారసత్వంగా రావాల్సిన ఉద్యోగం కోసం ఏళ్లుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు వందలాది మంది యువకులు. "రేపు వస్తుంది.. మాపు వస్తుంది" అనుకుంటూనే జుట్టు నరుస్తుందే తప్ప చేతికి ఆర్డర్ కాపీ రావడం లేదు. కళ్ల ముందే వయసు పైబడిపోతుంటే, ప్రైవేటు పనుల్లో నలిగిపోతూ, పెళ్లిళ్లు కాక, సమాజంలో తలదించుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకప్పుడు గనిలో ప్రాణాలొడ్డిన కార్మికుడి కుటుంబం, నేడు ఒక పూట కూటికి తల్లడిల్లుతుంటే ఆ బాధను వర్ణించడానికి ఏ పదాలూ సరిపోవు.



**ప్రభుత్వాలు మారినా.. పరిష్కారం పైపైనేనా..?**

ఎన్నికలు వచ్చినప్పుడల్లా సింగరేణి అడ్డాగా రాజకీయ నాయకులు ఇచ్చే హామీలకు కొరత ఉండదు. "మేము అధికారంలోకి రాగానే మారుపేర్ల సమస్యను ఒక్క కలం పోటుతో పరిష్కరిస్తాం" అంటూ మైకులు బద్దలు కొడతారు. కానీ, గద్దెనెక్కిన తర్వాత ఆ ఫైళ్లు సచివాలయాల అలమారాల్లో, సింగరేణి భవన్ల లాకర్లలో దుమ్ముధూళిలో పేరుకుపోతాయి.

**బాధితుల ఆవేదన**

"పాలకులు మారుతున్నారు, అధికారులు మారుతున్నారు... కానీ మా బతుకు గీత మారడం లేదు. సమస్యపై కమిటీలు వేయడం, నివేదికలు కోరడం తప్ప... శాశ్వత పరిష్కారం వైపు అడుగులు పడటం లేదు. మా సమస్యలపై అంతా పైపై పూతలేనా? అసలు చిత్తశుద్ధి ఎక్కడ?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**పెండింగ్ విజిలెన్స్ విచారణలు ఎప్పటికీ కొలిక్కి వచ్చేను..?**

మారుపేర్ల సమస్యను మరింత జటిలం చేస్తోంది సింగరేణి విజిలెన్స్ విభాగం. ఏళ్ల తరబడి సాగుతున్న విచారణలు ఎప్పటికీ ముగింపునకు రావు. ఒక చిన్న క్వొరీ, ఒక చిన్న సంతకం లేదా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పేరుతో దశాబ్దాలుగా విచారణలను సాగదీస్తూనే ఉన్నారు.

**కాలయాపన, కనికరం లేని కారుణ్యం లేని చట్టాలు**

విజిలెన్స్ విచారణల పేరుతో బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం పరిపాటిగా మారింది. సాంకేతిక కారణాలు చూపిస్తూ నిజమైన వారసులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారు.

**జీవితాలు బుగ్గిపాలు**

విచారణ కొలిక్కి వచ్చేసరికి అభ్యర్థికి ఉద్యోగ వయోపరిమితి దాటిపోతోంది. దీనికి బాధ్యులు ఎవరు? కరుణించని నల్ల సూర్యుడు.. కనువిప్పు కలిగేదెన్నడు? సింగరేణి కార్మికుడి కష్టంపై నడిచే ఈ సామ్రాజ్యంలో, అదే కార్మికుడి వారసుడు వీధిన పడటం అత్యంత దారుణం. ఇది కేవలం ఒక ఉద్యోగ సమస్య కాదు... వందలాది కుటుంబాల ఆత్మగౌరవ ప్రస్థానం, జీవన్మరణ సమస్య.

***ఇకనైనా పాలకులు, సింగరేణి యాజమాన్యం మానవీయ కోణంలో ఆలోచించాలి. చట్టాల చట్రాలు, నిబంధనల సాకులు పక్కనబెట్టి, ప్రత్యేక చొరవతో ఈ మారుపేర్ల సమస్యకు, పెండింగ్ విజిలెన్స్ కేసులకు తక్షణమే 'ఒకేసారి పరిష్కారం' (వన్ టైమ్ సెటిల్మెంట్) చూపాలి. నల్లబొగ్గు గని కార్మికుడి ఇంట్లో ఉద్యోగ దీపం వెలిగిన రోజే సింగరేణికి నిజమైన వెలుగు వస్తుంది. ఆ రోజు త్వరలోనే రావాలని ఆశిద్దాం!!***

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

## కలెక్టర్ ఆదేశాలతో ప్రైవేట్ స్కూల్లో 2బీహెచ్ కే పేద పిల్లలకు ఉచిత సీట్లు..



మల్కాజిగిరి, జూన్ 12,(విజన్ ఆంధ్ర): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరీ ఆదేశాల మేరకు డీఈవో సర్క్యులర్ జారీ చేయడంతో శుక్రవారం దమ్మాయిగూడ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం ఐదుగురు పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు లభించాయి. ఈ కార్యక్రమానికి దమ్మాయిగూడ మాజీ మున్సిపల్ చైర్మన్ వాసుపతి ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై , విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యా హక్కు చట్టం (ఆర్ టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25% ఉచిత సీట్లు కేటాయించాలన్న తెలంగాణ డిగ్నిటీ హౌసింగ్ కాలనీస్ 2 బీహెచ్ కె జాయింట్ యాక్షన్ కమిటీ వినతి మేరకు ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా వారి కృషి ఫలితంగానే పేద పిల్లలకు కార్పొరేట్ చదువులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ డిగ్నిటీ హౌసింగ్ కాలనీస్ 2 బీహెచ్ కె జాయింట్ యాక్షన్ కమిటీని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పేద పిల్లల చదువుకు విద్యా హక్కు చట్టం (ఆర్ టీఈ) ఎంతో దోహదపడుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ సందీప్, సెక్రటరీ జంగిలి శివకుమార్, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్కీ డిప్ ద్వారా 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' విద్యార్థుల ఎంపిక



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (దీూూ) పథకం కింద ఎస్.సి (రాజ) విద్యార్థుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్ ఆధ్వర్యంలో పారదర్శకంగా లక్కీ డిప్ (డ్రా) నిర్వహించారు. ఒకటవ తరగతి (డే స్కాలర్స్) ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఉప కులాల వారీగా లక్కీ డ్రా తీసి 47 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అలాగే, ఐదవ తరగతి (రెసిడెన్సియల్) ప్రవేశాల కోసం 49 మంది విద్యార్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయడం జరిగింది. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులందరూ తమకు కేటాయించిన బెస్ట్ అవైలబుల్ ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 20-06-2026 వ తేదీ లోపు చేరాలని, ఆ గడువు లోగా చేరిన వారికే ప్రవేశాలకు అనుమతి ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఆర్డినెన్స్ తెచ్చేందుకు కేంద్రంతో చర్చించాలి

**- రాష్ట్ర ప్రభుత్వానికి టీపీయూఎస్ డిమాండ్**



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌పై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు ఆర్డినెన్స్ తెచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) డిమాండ్ చేసింది. బుధవారం: ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా టీపీయూఎస్ అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. టెట్ విధానంలో స్పష్టత లేకపోవడంతో వేలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కేంద్రంతో సంప్రదించి ఆర్డినెన్స్ ద్వారా సమస్యను పరిష్కరించాలని జ్యోతి కోరారు. డీఎస్సీ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి చేయడంతో అనేక మంది అభ్యర్థులు నష్టపోతున్నారని, పాత విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోన రవీందర్, రాష్ట్ర బాధ్యులు ఎస్.పద్మాకర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి నల్ల రాజిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బానాల సుధాకర్, ఎడ్ల సంపత్, గొల్ల కుమార్, కొర్ర రాజన్న, బి.బద్రు నాయక్, ఒల్లాల రాజేందర్, శ్యామ్, కొత్తపెల్లి పోషన్న, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా:

**- ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ**



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్లాస్టిక్ రహిత ములుగుగా తీర్చిదిద్దేందుకు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు వినియోగించరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ స్పష్టం చేశారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం, ఆర్గానిక్ వస్తువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ మాట్లాడుతూ.... ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని వివరించారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హితమైన, ఆర్గానిక్ ఉత్పత్తులు వాడాలని సూచించారు. చైర్‌పర్సన్ చంద్రకళ మాట్లాడుతూలి "మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే అధికారులు ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుంటారు. మున్సిపాలిటీ చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తాం" అని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో వ్యాపారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## బాలలతో పని చేయిస్తే చర్యలు తప్పవు

**- లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మహేందర్, డీసీపీవో ఓంకార్**



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : బాలలతో పని చేయించడం నేరమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మేకల మహేందర్, డీసీపీవో జంగిలి ఓంకార్ హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ములుగు బస్ స్టాండ్‌లో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లివారు మాట్లాడుతూలి "పలక బలపం పట్టాల్సిన పిల్లలతో పలుగు పారా పట్టించొద్దు. బాల కార్మికులను గుర్తించి అన్ని వసతులు కల్పించి వ్యవస్థను నిర్మూలించాలి. ఇది అందరి బాధ్యత" అని అన్నారు. ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, ప్రయాణికులు పాల్గొన్నారు.

### వెంకటాపూర్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా అన్నబోయిన రాజు.



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్:లి మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు అంకం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఉపసర్పంచ్‌ల సమావేశంలో మండల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అన్నబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా మోరె లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా పాద్య రాజు, ప్రచార కార్యదర్శిగా జొన్నల రమ్య రమేష్, అధికార ప్రతినిధిగా తవిటి లావణ్య కుమారస్వామి ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు చింతం ప్రకాష్ రావు, అధికార ప్రతినిధి గోవిందు రాజ్ కుమార్ హాజరై నూతన కమిటీని అభినందించారు. ఉపసర్పంచ్‌ల హక్కులు, గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**- వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం**
**- బాల కార్మికుడి రక్షణకు తక్షణ చర్య తీసుకున్న జిల్లా యంత్రాంగం**
**- 24 గంటల్లోపు స్పందించి బాలుడిని కాపాడిన అధికార యంత్రాంగం**
**- చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. పెద్దమందడి మండలం అమ్మాయిపల్లి గ్రామంలో ఒక మైనర్ బాలుడు బాల కార్మికుడిగా పనిచేస్తున్నాడని నేషనల్ ఆదివాసీ సాలిడారిటీ కౌన్సిల్ ప్రతినిధి కె. మహేష్ ఫిర్యాదు చేయగా, అధికారులు వెంటనే స్పందించి 24 గంటల్లోపు బాలుడిని రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హన్వాడ మండలం నయనోనిపల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడు అమ్మాయిపల్లిలో పలగోర్ల నాగన్న వద్ద పనిలో ఉన్నట్లు గుర్తించారు. ఫిర్యాదు అందిన వెంటనే వనపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, తహసీల్దార్ మల్లికార్జున్, జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం అధికారి రాంబాబు, సిబ్బంది సురేందర్, సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని రక్షించారు. బాలుడి కుటుంబ పరిస్థితులను పరిశీలించగా తల్లి మరణించినట్లు, తండ్రి ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రానికి వలస వెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాలుడిని అతని కుటుంబ సభ్యుడైన చిన్నాన్న సంరక్షణలో అప్పగించారు. బాలుడికి చట్టపరంగా లభించాల్సిన పరిహార నిధులను అతని పేరుపై పోస్టాఫీస్ ఖాతాలో డిపాజిట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బాలుడి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్డీవో సుబ్రహ్మణ్యం తన తరఫున దుస్తులను అందజేశారు. అలాగే ప్రముఖ న్యాయవాది శంకర్ రెడ్డి బాలుడి పేరుపై డిపాజిట్ చేసేందుకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. బాలుడిని చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న వ్యక్తిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న అధికారులు, ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య, ఫీజు రాయితీ కల్పించాలి

**- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా నాయకులు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పరిధిలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఒకరికి ఉచిత విద్య, మరొకరికి కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు ) వనపర్తి జిల్లా, అధ్యక్షులు డి. మాధవరావు, జిల్లా కార్యదర్శి బి. రాజు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులు సమాజానికి నిరంతరం సేవలందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిజం నమ్ముకొని ఎటువంటి జీతభత్యాలు లేకుండా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న జర్నలిస్ట్ ల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యా ఖర్చులు భారంగా మారుతున్నాయని వివరించారు. 2026-27 విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని వనపర్తి జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లల్లో ఒకరికి ఉచిత విద్య, మరొకరికి కనీసం 50 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయ ఏవో భాను ప్రకాష్, జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని సంఘం ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నర్సింహా రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ రెహమాన్ యూనియన్ నాయకులు రాజేందర్ ,ధనుష్, నరేష్ గౌడ్, మహేష్ ,కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాలకృష్ణ, రాజకుమార్ నగేష్, మనోహర్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 12,(విజన్ ఆంధ్ర); జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు. రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం,

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష,**
**- వైద్య సేవల అమలుపై ప్రతిరోజూ సమీక్షలు,**
**- ఆరోగ్య సూచికల మెరుగుదలే లక్ష్యం,**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 12 ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ చించారు. శు క్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,ఉ.. జిల్లాలో వైద్య సేవల అమలుపై అంశాల వారీగా ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తానని, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలలో అందిస్తున్న సేవలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రత్యేకంగా తల్లి-శిశు ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీల నమోదు, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, ప్రసవానికి ముందు మరియు అనంతరం అవసరమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. జిల్లాలో తల్లి మరణాలు, శిశు మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో పర్యవేక్షించాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలను ముందుగానే అమలు చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సూచికలను మెరుగుపరిచే దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఇమినైజేషన్ అధికారి రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్వోలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు - అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12: విజన్ ఆంధ్ర జిల్లాలో యాసంగి 2025-26 కేఎంఎస్ (KMS) కింద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నేటితో ముగియనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా వరి ధాన్య సేకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగిందని పేర్కొన్నారు.ధాన్య సేకరణకు సంబంధించిన ముఖ్యాంశాలు మరియు ప్రగతి వివరాలను ఆయన తెలిపారు కొనుగోలు కేంద్రాల వివరాలు: జిల్లావ్యాప్తంగా వరి ధాన్య సేకరణ కోసం వివిధ ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేసిన మొత్తం 40 కొనుగోలు కేంద్రాలు (PACS – 19, DRDA – 21) నేటితో ముగుస్తాయి.సేకరణ వివరాలు: ఈ యాసంగి సీజన్ లో ఇప్పటివరకు మొత్తం 3,034 మంది రైతుల నుండి 14,962 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారుసన్నరకం ధాన్యం: 382 మంది రైతుల నుండి 1,952 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు దొడ్డురకం ధాన్యం: 2,587 మంది రైతుల నుండి 13,010 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాము. మద్దతు ధర (MSP): ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం క్వింటాలుకు గ్రేడ్-A రకానికి రూ. 2,389/- మరియు సాధారణ రకానికి రూ. 2,369/- చొప్పున గరిష్ట మద్దతు ధరను రైతులకు చెల్లించడం జరుగుతుంది.

బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ: ధాన్య విక్రయాలు జరిపిన రైతులకు నిధుల చెల్లింపు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు 492 మంది రైతులకు సంబంధించిన 2,720 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను రూ. 6 కోట్ల మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ముఖ్య గమనిక: కొనుగోలు కేంద్రాలు నేటితో ముగిసినప్పటికీ, మిగిలిన రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో వేగంగా నమోదు చేస్తున్నామని అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. మరో మూడు రోజుల్లో లబ్ధిదారులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో వారి బకాయి మొత్తాన్ని పూర్తిగా జమ చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## వర్షాకాల వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలి

**- డీఎంహెచ్‌వో గోపాల్ రావు**



ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణకు, జూన్ 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్ రావు సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పీహెచ్‌సీ వైద్యాధికారులు, పర్యవేక్షకులతో సమన్వయం చేసుకొని పటిష్ట ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాల వ్యాధుల నియంత్రణ మందులు సమకూర్చుకోవాలని, లేనిపక్షంలో ఇండెంట్ పంపాలన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100% సాధించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రంజిత్, డాక్టర్ నాగ అనేష్, మాస్ మీడియా అధికారి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

## సిటిజన్ కాలనీలో రోడ్డును మరమ్మతులు చేయిస్తా

**- మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్**



అల్వాల్, జూన్ 12, (విజన్ ఆంధ్ర): సిటిజన్ కాలనీలో రోడ్డును పునరుద్ధరించి మరమ్మతులు చేపడతామని మచ్చబొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ హామీ నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో డ్రైనేజీ లైన్ వేసిన రోడ్ నెం. 10 ప్రాంతంలో వరద నీటి నిల్వ ఏర్పడుతోందని ఈ సమస్యను పరిష్కరించాలని సిటిజన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కొంతమంది సభ్యులు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. వారి వినతి మేరకు వీలైనంత త్వరగా జీహెచ్ ఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపి, రోడ్డును పునరుద్ధ రించి మరమ్మతులు చేపడ తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్, బిక్షపతిరెడ్డి, ఎం ఎస్ నీలవేణి, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

## ఐ డి ఓ సి నీ పరిశీలించిన మంత్రి శ్రీహరి



నారాయణపేట, జూన్ 12 ( విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా కేంద్రం లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవ ర్ధక ,మత్స్య, యువ జన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక తో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసు కున్నారు. బిల్డింగ్ లోని మీటింగ్ హాల్, మంత్రి ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టరేట్ బిల్డింగ్ ప్రాంగణంలోనే హెలిపాడ్ ను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచన చేశా రు. ఈ ఏడాది పంద్రాగస్టు వరకు భవన నిర్మాణం పూర్తి అయ్యి ఐ డి ఓ సి ని అందు బాటులోకి తేవాలని అధికా రులను ఆదేశించారు. చివ రగా నూతన కలెక్టరేట్ సమీపంలోనే జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఇచ్చిన 7 ఎకరాల ప్రభుత్వ స్థలం గురించి డీఎస్పీ లింగయ్య తో మంత్రి ఆరా తీశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి స్ఫూర్తితో 'నువా' డైమండ్ కలెక్షన్‌ను ఆవిష్కరించిన మలబార్ గోల్డ్

హైదరాబాద్, జూన్ 12 (విజన్ ఆంధ్ర) : ప్రకృతి సహజ సౌందర్యాన్ని ఆధునిక డైమండ్ ఆభరణాల రూపంలో ఆవిష్కరించడమే లక్ష్యంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన తాజా న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ 'నూవా' ను ఆవిష్కరించినట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనతో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతిలోని సున్నితమైన ఆకృతులు, తేనెగూళ్ల నమూనాలు, సహజ నిర్మాణాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కలెక్షన్‌ను 18, 14 క్యారెట్ల బంగారంతో రూపొందించి, న్యాచురల్ డైమండ్స్, రంగురంగుల రత్నాలు, సిరామిక్ ఎనామెలింగ్, బహువర్ణ రోడియం ఫినిష్‌లతో అలంకరించినట్లు తెలిపారు. ఈ కలెక్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కరీనా కపూర్ ఖాన్ కొనసాగుతున్నారని తెలిపారు. హస్తకళా నైపుణ్యం, డిజైన్ ఆవిష్కరణ, సమకాలీన విలాసాన్ని సమన్వయం చేసిన ఈ కలెక్షన్ ఆధునిక మహిళల అభిరుచులకు అనుగుణంగా రూపొందించ బడిందని అన్నారు.